ఈనాడు కడప

గురువారం 17 ఆగస్టు 2017 16 పేజీలు



ఇక్కడా బోరుమనాల్సిందేనా!

జిల్లాలోనూ నోళ్లు తెరిచిన మృత్యు బోర్లు

నిర్లక్ష్యం చేస్తే.. పసి ప్రాణాలు బలి

మనదాకా రాకనే కదలాలి.. కదిలించాలి

ప్రతి పల్లెలో యువత ముందడుగు వేయాలి

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే : నిన్న రంగారెడ్డి.. నేడు గుంటూరు.. రేపు ఎక్కడ..? ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం కదా... బోర్లే కదా అని నిర్లక్ష్యం చేస్తే బొక్కనలో పడ్డట్టే... రాష్ట్రంలో నిండు ప్రాణాలను బలి తీసుకున్న సంఘటనలు అనేకం.. రెండ్రోజుల కిందట గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామంలో ఏడాదిన్నర వయస్సున్న బాలుడు బోరు బావిలో పడిన ఘటన అందరినీ ఆందోళనకు గురిచేసింది. అదృష్టం కొద్దీ ఆ బాలుడు 11 గంటలు మృత్యువుతో పోరాడి మృత్యుంజయుడుగా నిలిచాడు. ఈ ఘటన ప్రభుత్వాన్ని కూడా ఆలోచింపజేసింది. దీని గురించి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మంత్రులందరితో - మిగతా 7లో

ఈనాడు-మీతోడు

గుంటూరు జిల్లాలో జరిగిన సంఘటన మన జిల్లాలో జరగకుండా ఉండాలంటే నోరు తెరిచి ప్రమాదకరంగా ఉన్న బోవులను గుర్తించాలి. మీ పల్లెలో, మీ వీధిలో ఎక్కడైనా ఇలాంటి బోర్లు ఉంటే వాటి చిత్రాలను మాకు పంపించండి. అధికారులను అప్రమత్తం చేసి పూడ్చి వేతకు కృషి చేస్తాం. ఇంకెందుకు ఆలస్యం ఆండ్రాయిన్ ఫోన్ ఉంటే చిత్రాలను పంపండి.

వాట్సప్ నంబరు : 9059913284

కాశినాయనలో భూకబ్జాలపై

విచారణకు ఆరు బృందాలు

నేడు అక్కెంగుండ్లకు ఆర్డీవో వీరబ్రహ్మం రాక

కాశినాయన - బద్వేలు, న్యూస్‌టుడే : కాశినాయన మండలంలోని అక్కింగుండ్ల, సావిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామాలలో జరిగిన భూకబ్జాలపై మూడు రోజులుగా 'ఈనాడు - కడప'లో వచ్చిన కథనాలకు జిల్లా అధికారులు స్పందించారు. భూముల అక్రమాలపై విచారణ జరిపేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లోని సభ్యులు గురువారం నుంచి ఆయా గ్రామాల్లో పర్యటించి విచారణ చేపట్టనున్నారు. వీరితో పాటు రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం కూడా గురువారం అక్కెంగుండ్ల గ్రామాన్ని సందర్శించనున్నట్లు సమాచారం. కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, గోపవరం, బద్వేలు, - మిగతా 7లో

కరవు కడప.. కన్నీటి గడప!

ఉపాధికీ దిక్కులేక తప్పని వలసలు.. ఖాళీ అయిన గ్రామాలే సాక్ష్యం

కాయకష్టం కన్నీటిపాలైంది.. పెట్టిన పంట మట్టిలోకే చేరింది.. కరవు రక్కసి కడప జిల్లాలో కరాళనృత్యం చేసింది. ఉపాధికీ దిక్కులేక ఊళ్లు ఖాళీ చేసిన పరిస్థితి. రాయలసీమ జిల్లాల్లో క్షామ పరిస్థితులు రోజురోజుకూ ఎక్కువవుతుండగా జిల్లా పరిధిలోనూ ఆ సమస్య తీవ్రంగా ఉంది. వర్షాలు లేక జలాశయాలు నిండటం లేదు.పంటలు దక్కడం లేదు. వరస కరవులతో కడప కన్నీరు పెడుతోంది.

- జిల్లాలో గత 16 ఏళ్లలో 9 వరుస కరవులు
- 8 మండలాల్లో తీవ్ర ప్రభావం.. 8 ఏళ్లుగా 12 మండలాల్లో దయనీయం
- పెట్టిన పంటలు చేతికి రాక ఆర్థికంగా చితికి రైతులు అప్పులపాలు
- చెన్నూరు నయం.. అత్యల్పంగా మూడేళ్ల కరవు నమోదు
- అధికారిక లెక్కలు.. ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి

ఈనాడు, కడప : గతేడాది రాయచోటి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో వేరుసెనగ ఎండిపోయింది. జలఫిరంగులు కాపాడలేకపోయాయి. కొందరు పొలంలోనే పంట వదిలేశారు. లింగాల, - మిగతా 7లో



నీళ్లు రాక.. తడి అందక..



అక్కెంగుండ్ల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అక్కెంగుండ్ల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నేతృత్వంలోని పలువురు సభ్యులు బుధవారం కలెక్టర్‌ను కోరారు. ఈనాడులో కాశీనాయన మండలంలోని అక్కెంగుండ్లలో జరిగిన భూ ఆక్రమణపై వచ్చిన కథనాన్ని కలెక్టరుకు చూపిస్తూ అక్కడ నెల రోజులుగా జరుగుతున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. హైదరాబాద్, వరంగల్, గుంటూరు, మాచర్ల, ప్రొద్దుటూరు, కడప తదితర ప్రాంతాల్లోని ధనవంతులు ఆక్రమించుకుని కోట్లాది రూపాయలు సంపాదించుకుంటున్నారన్నారు. వాస్తవానికి అసైన్డ్ చట్టప్రకారం ఒక వ్యక్తి ఐదెకరాలకు మించి అనుభవించకూడదనేది నిబంధన ఉన్నా అక్కడి అధికారులు యథేచ్ఛగా బడాబాబులకు అప్పగిస్తున్నారన్నారు. పేద దళితులకు ఇచ్చిన భూములను ఆక్రమించి దాడులు చేస్తున్నారన్నారు. తక్షణమే ఆ భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం సావిశెట్టిపల్లె దళితవాడకు చెందిన పోలయ్యపై దాడిచేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేయాలని ఎస్పీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి అన్వేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

చీటీల పేరుతో మోసగించినట్లు ఫిర్యాదు.. కేసు నమోదు

పులివెందుల, న్యూస్‌టుడే: చీటీల పేరుతో స్థానిక చెన్నారెడ్డి కాలనీలో నివసిస్తున్న దేవిరెడ్డి పద్మలత అనే మహిళ తమను మోసగించి రూ.15 తులాల బంగారం, ఇళ్లను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నట్లు బాధితులు రాజ్‌కుమార్, అంజలి, షేక్‌బీలు ఆరోపించారు. ఈమేరకు న్యాయం చేయాలంటూ వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆశ్రయించారు. ఇక్కడ ఉన్న సీఐ ప్రసాద్‌కు తమ గోడును విన్నవిస్తూ ఫిర్యాదు చేశారు. దేవిరెడ్డి పద్మలత కొన్ని నెలల క్రితం రూ.15 లక్షల చీటీ వేస్తున్నానని చెప్పడంతో ఆశతో ఆమె వద్ద చీటీలు వేశామని బాధితులు సీఐకి విన్నవించారు. వాయిదాల పద్ధతిలో చీటీ డబ్బులు క్రమంగా చెల్లిస్తున్నప్పటికీ చెల్లించలేదంటూ తమ వద్దనున్న బంగారం, ఇళ్లను తన అనుచరులతో దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ఈ విషయమై విచారించి న్యాయం జరిగేలా చూస్తామని వారితో చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు దేవిరెడ్డి పద్మలతపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



సీఐ ప్రసాద్‌కు తమ గోడు వివరిస్తున్న బాధితులు

‘ఉక్కు’ స్థాపనతోనే ఉపాధి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బాలస్వామిరెడ్డి



బూట్లు పాలీష్ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: రాయలసీమలోని నిరుద్యోగులకు ఉపాధి లభించాలంటే అది కేవలం కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపనతోనే సాధ్యమవుతుందని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బాలస్వామిరెడ్డి అన్నారు. కడప కోటిరెడ్డి కూడలిలో రాకపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు బుధవారంతో 41వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ప్రారంభించిన బాలస్వామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు. వీరంతా ఉపాధి కొరకు ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసలు వెలుతున్నారని, అదే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానికంగానే మంచి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా సీమ ఎడారిగానే ఉందని, ఇక్కడి పాలకులు సీమపై చిత్తశుద్ధి చూపకపోవడంతో ఈ సమస్య అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. సాదు, జానకీరామ్, కుమార్, వెంకట సుబ్బయ్య, సునీల్ భరత్, రంగస్వామి దీక్షలలో కుర్చున్న వారిలో ఉన్నారు.

ఉక్కు సాధన కోసం బూట్ పాలిష్

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కడపలోని కోటిరెడ్డి కూడలిలో రావియుస, పవనిజం విద్యార్థి సంఘం నాయకులు బూట్లు పాలిష్ చేసి నిరసన చేశారు. రాయలసీమ ప్రాంత ప్రజలు కేవలం ఓట్లు వేసేందుకే పనికొస్తారా? అని నాయకులు ప్రశ్నించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి, మూడేళ్లు అవుతున్నా అతీగతి లేదన్నారు. రాయలసీమపై వివక్ష చూపుతున్నారని చెప్పడానికి ఇదే ఉదాహరణ అని అన్నారు. సీమ ప్రాంతంలో నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇదే కొనసాగితే యువత చెడు మార్గంలో వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి, సీమాభివృద్ధికి పాటు పడాలని, లేకపోతే యువత సత్తా చాటుతామని అన్నారు. కార్యక్రమంలో భరత్, షరీఫ్, శంకర్, సుబ్బరాయుడు, మహేష్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

20 నెలలకు వీడిన హత్యకేసు మిస్టరీ

★ మిల్లు యజమాని అనుకుని కాపలాదారుని హత్య

★ నిందితుడు నేరం అంగీకారం.. అరెస్టు

ప్రొద్దుటూరు పురపాలక న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు మండలం ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన చాగారి చంద్రశేఖర్‌రెడ్డి (32) హత్య కేసు మిస్టరీ 20 నెలల తర్వాత వీడిపోయింది. ఎవరు చంపారో.. ఎలా చంపారో పోలీసులు నిగ్గు తేల్చారు. ఈ విషయమై గ్రామీణ సీఐ జి. ఓబులేసు యాదవ్ బుధవారం రాత్రి గ్రామీణ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు గ్రామీణ పరిధిలోని మదూరు రోడ్డులోని శ్రీనివాస మిల్లులో గుమస్తాగా పని చేస్తున్న చాగారి చంద్రశేఖర్‌రెడ్డి (32) 2016 జనవరి 14న హత్యకు గురయ్యారు. ఇతడిని అదే మిల్లులో హమాలీగా పని చేస్తున్న ఆదినారాయణరెడ్డి (39) ఇనుప రాడ్డుతో కొట్టి చంపినట్లు వెల్లడైంది. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన ఆదినారాయణరెడ్డి స్థానిక అమృతనగర్‌లో నివాసం ఉంటూ శ్రీనివాస మిల్లులో హమాలీ పని చేసేవాడు. ఇతడి భార్య కూడా అదే మిల్లులోనే దిన కూలీ. మిల్లు యజమాని వెంకట్రామిరెడ్డితో వివాహేతర సంబంధం పెట్టుకున్న విషయమై ఆదినారాయణరెడ్డి తన భార్యతో గొడవపడ్డాడు. తర్వాత మిల్లులో పని చేయకుండా మానుకున్నాడు. భార్యతో సంబంధం పెట్టుకున్న వెంకట్రామిరెడ్డిని ఎలాగైన చంపాలని ఆదినారాయణరెడ్డి కక్ష పెంచుకున్నాడు. ఆ తర్వాత మళ్లీ మిల్లులో పనికి చేరారు. అమృతనగర్‌లో ఉంటూ పనికి వచ్చేవారు. పండగ రోజుల్లో మిల్లుకు కాపలాగా రాత్రి వేళల్లో వెంకట్రామిరెడ్డే పడుకుంటారు. అతడిని చంపడానికి అదే అనుకూల సమయమనుకున్నారన్నారు. 2016 జనవరి 14న చంపాలని వెళ్లగా ఆ రోజు యాజమాని కాకుండా గుమస్తా చంద్రశేఖర్‌రెడ్డినే పంపారు. ప్రణాళిక ప్రకారం ఆదినారాయణరెడ్డి అర్ధరాత్రి మిల్లు దగ్గర ఉన్న విద్యుత్తు నియంత్రికలో కరెంటు ఆప్ చేశారు. మిల్లు ఆరు బయట మంచంలో దుప్పటి కప్పుకొని నిద్రిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని యజమాని వెంకట్రామిరెడ్డి అనుకొని ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. ఈ మేరకు ఆదినారాయణరెడ్డి తమ విచారణలో ఒప్పుకున్నారని సీఐ ఓబులేసు యాదవ్ వెల్లడించారు. తాము ఇదివరకే ఆదినారాయణరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించినా అనుమానం రాకుండా వ్యవహరించేవారన్నారు. అనేక కోణాలలో విచారణ చేపట్టగా అతనే నిందితుడని తేలిపోయిందన్నారు. నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండుకు పంపుతున్నట్లు ఆయన వివరించారు. ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు రామాంజులు, ఖాదర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఓబులేసుయాదవ్, ఆయన వెనుక నిందితుడు ఆదినారాయణరెడ్డి

అందరినీ ఉన్నతీకరించాలి

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ఉన్నతీకరణ కోసం తాము ఎంతో కృషి చేసి బూజుపట్టిన దస్త్రాల దుమ్ముదులిపితే అధికారులు జీవో ఇచ్చినప్పటికీ కేవలం 70 శాతం మాత్రమే ఉన్నతీకరించడం దారుణమని రాష్ట్ర భాషోపాధ్యాయసంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా 30 శాతం మంది భాషా పండితుల పోస్టులను ఉన్నతీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తరువాత 58:42 నిష్పత్తిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు భాషోపాధ్యాయులను, వ్యాయామ పండితులను పంచుకున్నారన్నారు. ఈ గణాంకాల్లో రాష్ట్రానికి 2,650 మంది పండితులు, పీఈటీలు వచ్చారన్నారు. అందులో 1450 మంది భాషా పండితులు, మిగతా 1200 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పంపకంలో భాగంగా వచ్చినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి వృత్తిలో ఉన్న వారికి పదోన్నతులు కల్పించకుండా డీఎస్సీ వారికి 30 శాతం ఇస్తామనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. వందకు వందశాతం వారిని ఉన్నతీకరించాలన్నారు. గురువారం అమరావతికి వెళ్లి అక్కడ అధికారులతో భేటీ అయి ప్రత్యేక విన్నపం ద్వారా దస్త్రాన్ని మరింత వేగంగా ముందుకు కదిలించనున్నామని తెలిపారు.

సంపాదనలో.. సగం ఇంటికి సగం ఒంటికి

ఆరోగ్యం కోసం తప్పని 'ఖర్చులు'

సర్కారు వైద్యంపై భరోసా లేకనే..

ప్రజల ఆర్థికపరిస్థితిని దిగజార్చుతున్న 'అనారోగ్యం'

ఆదుకోలేక పోతున్న సర్కారు దవాఖానాలు

పట్టణానికి చెందిన గోపాల్ వృత్తిరీత్యా ఆర్టీసీ డ్రైవరు. ముప్పైఏళ్లపాటు నిర్విరామంగా ఉద్యోగం చేయడంతో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యారు. ఉద్యోగం విరమించగానే రక్తపోటు, మధుమేహంతోపాటు గుండెపోటుకూడా తోడయ్యింది. ఆయనకు ప్రతినెల రూ.20,000 పింఛను అందుతుంది. అయితే అందులో ఈ రోగాలన్నింటికీ మందులకోసం రూ. 5,000, రెండువారాలకోసారి పరీక్షల కోసం రూ. 1,000, వైద్యుడిని కలవాల్సి వస్తే మరో రూ. 2,000 అదనంగా ఖర్చవుతోంది. అంటే ప్రతినెలా ఆయన తన ఆరోగ్యంకోసం రూ. 8,000 ఖర్చుచేయాల్సిఉంది. అంతాచేసినా ఆరోగ్యం మాత్రం అంతంతమాత్రమే.

వడ్డిపల్లెకు చెందిన గంగాభవానికి ఏడాది క్రితం వివాహమైంది. భర్త శివయ్య దినసరి కూలీ. తొలి కాన్పు సమయంలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కాన్పు కష్టమవుతోందని వెంటనే తిరుపతికి తీసుకెళ్లమన్నారు ఇక్కడి వైద్యులు. చావుబతుకుల మధ్య అక్కడికెళితే.. బిడ్డ అడ్డం తిరిగిందని, శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. అది నిజమోకాదో తెలుసుకునే పరిస్థితిలో భర్త లేడు. శస్త్రచికిత్స, తదుపరి వైద్యంకోసం రూ. 25,000 ఖర్చవుతుందన్నారు. ఎన్నాళ్లు కూలి పనికి వెళితే అంత డబ్బు కళ్లజూడగలడు. అందుకే తాము ఉంటున్న ఇంటిని వేరొకరికి తనఖాపెట్టి డబ్బు సర్దుకున్నాడు. ఎలాగో భార్యాబిడ్డలను ఇంటికి తెచ్చుకున్నాడు. అయితే ఆర్థికంగా చితికిపోయాడు. పుట్టిన బిడ్డనుచూసుకుని మురిసిపోవాలో - లేక ఇంటిమీద తెచ్చిన అప్పును ఎలా తీర్చుకోవాలో తేల్చుకోలేక శివయ్య సతమతమవుతున్నాడు.

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: 2011 జనాభా లెక్కల ప్రకారం మన జిల్లా జనాభా 28,82,469 - ఈ ఏడాది అంచనాల ప్రకారం 30,33,963. వీరిలో కనీసం 20లక్షలమంది ప్రతిరోజు ఏదో ఒక కారణంతో ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితిఉంది. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, ఆందోళనవంటి అనేక కారణాలు మనిషిని ఆరోగ్యాన్ని 'కొనుక్కునే'దిశగా ప్రయాణింపజేస్తున్నాయి. గోపాల్, శివయ్య లాంటివాళ్లు ప్రతివీధిలోను తారసపడుతుంటారు. ఇన్ని ఉన్నా.. ప్రభుత్వ వైద్యవిధానాలపై ప్రజలకు నమ్మకం కలగడంలేదు.



వైద్యశిబిరాలు.. పేదలపాలిట ఆశాదీపాలు. ఎక్కడ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసినా ఊతకర్ర సాయంతోనైనా అక్కడికి చేరుకుంటున్నారు వృద్ధులు, రోగులు. ఎందుకంటే ఆసుపత్రి ఖర్చులు భరించేకన్నా ఈ దూరం పెద్దదికాదన్నది వారి అభిప్రాయం. అక్కడ ఇచ్చే కొద్దిపాటి మందులు, సూచనలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తాపత్రయపడుతుంటారు.

నిధులు పెంచినా ఫలితం లేదు : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు ఈ ఏడాది బడ్జెట్లో రూ. 7,020.63 కోట్లు కేటాయించారు. ఇది గతేడాదికంటే 15.02శాతం ఎక్కువ. గతేడాది ఎన్టీఆర్ వైద్యసేవకోసం రూ. 840 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. వెయ్యికోట్లు ఇచ్చారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకోసం రూ. 200 కోట్లు, ఔషధాల కొనుగోలుకు రూ. 260.58 కోట్లు కేటాయించారు. చంద్రన్న సంచార చికిత్స కేంద్రాలకోసం రూ. 64.95కోట్లు, వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల ఉన్నతీకరణకోసం రూ. 50కోట్లు, పరికరాల కొనుగోలుకు రూ. 10కోట్లు కేటాయించారు. అయినా ప్రజల జేబుఖర్చులుమాత్రం ఎక్కడా తగ్గకపోవడం - సర్కారు వైద్యవిధానాలను వెక్కిరిస్తోంది.

ప్రైవేటు సేవలకే ప్రాధాన్యం...

ఏఒక్క ప్రభుత్వ వైద్యుడు ప్రభుత్వాసుపత్రి ఉద్యోగంతో సరిపెట్టుకోవడంలేదు. ప్రతిఒక్కరికి ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. రోగులు రాగానే వారిని రోగులుగా కాకుండా 'నడిచొచ్చే నోటు'లా చూడడం 'కొందరు' వైద్యులకు అలవాటుగా మారింది. ధనార్జన ముందర విద్యుక్తధర్మం విధ్వంసమవుతోంది. నాడిపట్టి చూడాల్సిన రోగానికి ఎక్స్‌రే అడుగుతున్నారు. స్టెతస్కోప్ స్థానంలో స్కానింగ్ తీయించమంటున్నారు. రక్తపరీక్షలకు బదులుగా మొత్తం దేహాన్నే పరీక్షించి నివేదికలు తీసుకురమ్మని పురమాయిస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వాసుపత్రుల్లో కుదరకపోతే తమకు అనుబంధంగా నడిచే పరీక్షాకేంద్రాలకు రోగులను సిఫారసు చేస్తున్నారు. వైద్యనారాయణులు ఇలా తయారుకాబట్టే ప్రజలు లక్ష్మీకటాక్షాన్నికాస్తా ఆసుపత్రులకు వదిలేసుకోవాల్సి వస్తోంది.



రాటకొండ్ల చెంగయ్యనాయుడు, సులోచన దంపతులు. మండలపరిధిలోని మారావారిపల్లెకు చెందిన ఈ కుటుంబం ఆరోగ్యంకోసం అన్నీ కోల్పోయారు. పదేళ్ల క్రితం ప్రారంభమైన మూత్రపిండాల(కిడ్నీల)వ్యాధి వీరి ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది. భర్తకు రెండు మూత్రపిండాలు చెడిపోవడంతో భార్య తన మూత్రపిండాన్ని దానం చేసింది. అయినా భర్త కోలుకోలేదు. చివరకు దాతల సహకారంతో ఆయనకు శస్త్రచికిత్సలు చేయించుకుంటూ ఇప్పటికీ నరకవేదనను అనుభవిస్తూనే ఉన్నారు.

అంచనాలకు అందని 'లెక్క'లు

30 లక్షల మంది జిల్లా జనాభాలో ఆసుపత్రి ఖర్చులకు ఎవరెవరు ఎంతెంత వెచ్చిస్తున్నారంటే.. అంచనాలు కష్టమే. ఎందుకంటే పూర్వం జ్వరం, జలుబు, మహాఅయితే ఏదోఒక శస్త్రచికిత్సతో మనిషి కోలుకునేవారు. కానీ ఇప్పుడు ఒళ్లంతా రోగాల పుట్టగా మారుతోంది. నోరుతిరగని రోగాల పేర్లతో జనం అల్లాడుతున్నారు. జిల్లా పరిధిలో ప్రతిరోజు 10 లక్షలమంది ఆసుపత్రికి వెళతారనుకుంటే.. ఒక వ్యక్తి డాక్టరును కలవాలంటే ముందుగా రూ. 100 చెల్లించి టోకెన్ తీసుకోవాలి. ఇది ఆయా వైద్యుల స్థాయినిబట్టి రూ. 200వరకు కూడా ఉండవచ్చు. అనారోగ్య తీవ్రతను బట్టి రక్తపరీక్షకు రూ. 100, మందులకు రూ. 500, ప్రయాణఖర్చులకు మరో రూ. 100. మొత్తంగా ఒక్కోవ్యక్తి సుమారు రూ. 1000 ఖర్చుచేస్తారు. పదిలక్షల మంది ఒకరోజుకు ఒక్కొక్కరు వెయ్యిచొప్పున ఖర్చుచేస్తే అది అక్షరాలా రూ. 100కోట్లు అవుతుంది. అంటే నెలకు రూ. 3000కోట్లు, ఏడాదికి రూ. 36వేల కోట్లు కేవలం ఆరోగ్యానికి ఖర్చుయిపోతోంది. బడ్జెట్‌లో రాష్ట్రం మొత్తానికి రూ. 7020 కోట్లు కేటాయించారు. కానీ ఇక్కడ ఒక్క జిల్లాజనాభానే రూ. 36వేల కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వం ఎలా భర్తీ చేస్తుందన్నది సామాన్యుడి సందేహం.

అత్తెసరు వైద్యం..

- జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు - 73
- ఆరోగ్య ఉపకేంద్రాలు - 448
- 24 గంటలు పనిచేసే కేంద్రాలు - 34
- సీమాంక్ ఆసుపత్రులు - 06
- పి.పి. యూనిట్లు - 04
- పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రాలు - 01
- ఆంధ్రప్రదేశ్ వైద్యవిధానపరిషత్ వైద్యశాలలు - 12
- జిల్లా కేంద్ర వైద్యశాలలు - 01
- ప్రాంతీయ వైద్యశాలలు - 01
- వైద్య కళాశాలలు - 01
- ప్రభుత్వ వైద్యశాలలు - 01
- పట్టణ ఆరోగ్యకేంద్రాలు - 10
- వీటిల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్ల సంఖ్య - 2,315

వ్యాపారంగా మారింది



ప్రభుత్వ విద్యాసంస్థలు ఎలా నీరుగారి ప్రైవేటు, కార్పొరేట్ విద్య రాజ్యమేలుతోందో అచ్చం అలాగే ప్రభుత్వ వైద్యంకూడా దిగజారింది. ఇదే ఆసరాగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రాధాన్యం పెరిగింది. విద్య, వైద్యం ఈరెండూ ప్రస్తుతం ప్రజావసరాలుగా కాకుండా కేవలం వ్యాపారాలుగా మాత్రమే మారుతున్నాయి. ఔషధాల కొనుగోలుకే ప్రజలు ఎక్కువ ఖర్చుచేస్తున్నారు. కొందరు దుకాణాల్లో అప్పులు, ఖాతాలుకూడా పెట్టుకుంటున్నారు. వైద్యం ప్రజల హక్కుగా మారాలి. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో అధికభాగం ప్రజావైద్యానికే కేటాయించాలి. సీఎం సహాయనిధి, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకాలు అమలవుతున్నా కనీస వైద్యం కరవవుతోంది. ఈ పరిస్థితిపై ప్రభుత్వం స్పందించాల్సిఉంది.

- రాగిపాటి మోతీలాల్, ఔషధ వ్యాపారి, రైల్వేకోడూరు

అవగాహన ముఖ్యం



రాజంపేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చారు. ఇక్కడ ఎక్స్‌రే, స్కానింగ్, అన్నిరకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఇలాగే జిల్లాలోకూడా చాలా ఆసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. కానీ ఇదివరకటి పరిస్థితుల ఆధారంగా ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని నమ్మడంలేదు. ఏ అనారోగ్యం చేసినా వెంటనే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. అందుకే ప్రజల ఆరోగ్యఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. తమిళనాడులో ప్రతిఒక్కరు చివరికి ప్రభుత్వ ఉద్యోగులుకూడా కేవలం ప్రభుత్వాసుపత్రులకే వెళ్తారు. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. శస్త్ర చికిత్సలతోసహా అన్నిరకాల వైద్యాలు చేస్తున్నా జనంలో అవగాహన రావడంలేదు. ఈవిషయంపై ప్రభుత్వం చొరవతీసుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. దాంతోపాటు వైద్యులుకూడా ఆసుపత్రులకు వచ్చే రోగులపట్ల మానవతాదృక్పథాన్ని ప్రదర్శించాలి. రోగికి ఔషధంకంటే వైద్యుని పలకరింపే సగం బలాన్నిస్తుంది.

- డాక్టర్ ఎన్. సుబ్బరాయుడు, సూపరిండెంట్, రాజంపేట

'గోల్డెన్ అవర్'ని అందుకుందాం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ప్రమాదం జరిగిన తొలి గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని, ఆ సమయంలోపు బాధితుల వద్దకు చేరుకుని వారికి సహాయచర్యలు అందజేయడానికి కృషి చేద్దామని కడప ఎస్పీ బాబూజీ అట్టాడ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో బుధవారం ఆయన తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, కడప డీటీసీ బసిరెడ్డి, నేషనల్ హైవే డీఈ శ్రీనివాసమూర్తి, డీఎస్పీ వెంకటరమణ, ఎంవీఐ సురేష్‌నాయుడు, రాజంపేట బ్రేక్‌ఇన్స్‌పెక్టరు రాజాబాబు, డెమోకారిడార్ డీఎస్పీ సుధాకర్, ఒంటిమిట్ట సీఐ రవికుమార్, రాజంపేట సీఐలు మురళీనాయక్, రామాంజినాయక్‌లతో కలసి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపనుంచి రేణిగుంటవరకుగల 140 కిలోమీటర్ల ప్రాంతాన్ని ప్రభుత్వం డెమెకారిడార్‌గా గుర్తించిందన్నారు. నేషనల్ హైవే 716పై ప్రమాదాల నిరోధానికి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రపంచబ్యాంకు నిధులతో ఈ ప్రాంతానికి ఎనిమిది పెట్రోలింగ్ వాహనాలు మంజూరయ్యాయన్నారు. ప్రతి 25 కిలోమీటర్లకు ఓ వాహనం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ చర్యలవల్ల ఈ రోడ్డుపై ఇదివరకంటే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నట్లు తెలిపారు. పోలీసులు, వైద్యసిబ్బంది, రోడ్లు, భవనాలశాఖ, రోడ్డురవాణాశాఖల సమన్వయంతో డెమోకారిడార్ నిర్వహణను పటిష్టపరుస్తున్నట్లు తెలిపారు. అయితే మరికొన్ని అవసరాలు ఉన్నాయన్నారు. ప్రత్యేక అంబులెన్స్‌లు, బ్రీత్ ఎనలైజర్లు, ప్రథమ చికిత్స కిట్లు, దూరప్రాంతాల చోదకులకు సేదతీరే ప్రాంతాల ఏర్పాటు, జియోట్యాగింగ్, రాత్రిపూట జరిగే ప్రమాదాలను అరికట్టడంవంటివాటిపై అధికారులతో చర్చించారు. సకాలంలో స్పందించి ప్రమాదబాధితుల ప్రాణాలను కాపాడగలిగితే ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చినవారమవుతామని ఎస్పీ పేర్కొన్నారు. ఈవిషయంలో అన్నిశాఖల అధికారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వందృష్టికి తీసుకెళతామని తెలియజేశారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ సాయినాథ్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎస్పీ బాబూజీ అట్టాడ, తిరుపతి ఎస్పీ అభిషేక్ మహంతి

రైల్వేకోడూరు

నేడు వీఎంపురంలో గ్రామసభ

పెనగలూరు: మండల పరిధిలోని వీఎంపురం, దామన్‌చర్ల రెవెన్యూ గ్రామాల రైతులతో రెవెన్యూ గ్రామ సభ జరుగుతుందని తహసీల్దార్ శిరీష తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వీఎంపురం గ్రామంలో జరిగే గ్రామ సభలో రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సూచించారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : తపాలా ఉద్యోగుల కోర్కెలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ శాఖ సిబ్బంది బుధవారం సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే తపాలా ఉద్యోగులు 160 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నామన్నారు. కమలేష్ చంద్ర కమిటీ, ఏఐజీడీఎస్‌ సవర్గలతో కూడిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ఓబులవారిపల్లె తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జీడీఎస్‌కు 8 గంటలు పని కల్పించినా వారి క్రమబద్ధీకరణ చేయాలన్నారు. క్యాట్ ఢిల్లీ, క్యాట్ మద్రాస్‌ల తీరును అనుసరించి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. లక్ష్యం పేరుతో జీడీఎస్‌లను బలవంతంగా చేయించడం ,మానసికంగా వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని తపాలా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చంటిబిడ్డలు జాగ్రత్త తల్లీ..



పట్టణంలోని కృష్ణానగర్‌లో నివాసముంటున్న రూప, రెడ్డిశేఖర్ దంపతులకు రెడ్డిరాం అనే రెండేళ్ల కుమారుడున్నాడు. వీరు పానీపూరీ బండిని నిర్వహించి జీవిస్తున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో రెడ్డిరాం పోలీస్‌స్టేషన్ సమీపంలో తిరుగుతూ ఏడుస్తుంటే అక్కడివారు లోపలికి తీసుకువచ్చారు. ఎస్సై భక్తవత్సలానికి అప్పగించారు. ఓవైపు కడప, చిత్తూరు జిల్లాల ఎస్పీల సమావేశంలో తలమునకలవుతున్నా.. అధికారులు చిన్నారిని అతని తల్లిదండ్రుల చెంతకు చేర్చడానికి చర్యలు చేపట్టారు. వెంటనే ఓ కానిస్టేబుల్‌తో అతడు చెబుతున్న ఆనవాళ్ల ఆధారంగా వెతికించారు. ఇంతలో తమ కుమారుడు కనిపించడంలేదంటూ తల్లిదండ్రులు వెతుకులాడసాగారు. చివరకు పోలీసులు బిడ్డను తల్లికి అప్పగించారు. చిన్నబిడ్డలున్నవారు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను అపహరించుకుపోయేవారుకూడా తిరుగుతుంటారని అందువల్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. - **రైల్వేకోడూరు, న్యూస్‌టుడే**

బీసీ వర్గంలో ఇతర కులాలను చేర్చరాదు




రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న జాతీయ కన్వీనర్ మల్లికార్జున

పుల్లంపేట, న్యూస్‌టుడే: ఇతర కులాలను బీసీ వర్గంలో చేర్చరాదని బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలోని రెవెన్యూ సిబ్బందికి ఆయన బిసి రాజకీయ సంకల్పయాత్రలో భాగంగా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక రీతిలోనే బీసీ ఉప ప్రణాళిక రూపొందించాలన్నారు. దీంతో బీసీలు అభివృద్ధి బాటపడే అవకాశం ఉందన్నారు. ఇతర వర్గాల వారిని బీసీ చేర్చడం ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఉద్యోగాల్లో పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మునెయ్య, నరసింహులు, రామయ్య, ఆంజేయులు, స్థానిక చేనేత నాయకులు పాల్గొన్నారు.



ఎనిమిదేళ్ల క్రితం బి.పి.రాచపల్లెలో గ్రామపంచాయతీ కార్యాలయంను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏర్పాటు చేసిన కిటికీలు, తలుపులు చెదులు పట్టి పాడైపోతున్నాయి. అధికారులు,నాయకులు ఎవరు ఆ భవన ప్రారంభించేందుకు ముందుకురాలేదు. ఇప్పట్లో ఆ భవనం వినియోగంలోకి వస్తోందనే నమ్మకంకూడా లేదు. సుమారు రూ.30 లక్షలకుపైగా ఖర్చు చేసి భవనం నిర్మించారు. ప్రారంభం మరిచారు. అధికారులు స్పందిస్తే భవనం వినియోగంలోకి వస్తుంది.

పాతికేళ్ల ముందు బి.పి.రాచపల్లె గ్రామంలో అంగన్వాడీ భవనం ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అక్కడ 13 మంది చిన్నపిల్లలు ఉన్నారు. అయితే భవనం పూర్తిగా బీటలు వారింది. ఎప్పుడైన కూలిపోవచ్చు. గ్రామస్థులు అనేక సార్లు అధికారులకు చెప్పారు. అయితే అధికారులు నెర్రెలను కప్పేందుకు ప్రయత్నాలు చేశారేగాని కొత్తభవనం ఏర్పాటు చేసి చిన్నారులకు రక్షణ కల్పించాలనే ఆలోచనలేకుండాపోయింది.





అదే గ్రామంలో దశాబ్దం ముందు ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. అక్కడ 30 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం శిథిలావస్థలో ఉంది. అనేక సార్లు విద్యాశాఖాధికారులు వచ్చిన భవనం పరిశీలించారు. కొద్దిపాటి వర్షం పడితే గదిలోపల నీళ్లు నిలుస్తుంటాయి. విద్యార్థులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా భవనం కూలిపోయే పరిస్థితుల్లో ఉంది. సర్వశిక్షాభియాన్ ద్వారా కొత్త భవనం ఏర్పాటు చేయాలసి ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

బి.పి.రాచపల్లె.. కష్టాలతో తల్లడిల్లె

● ఇలా ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందేనా..

ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేస్తామని ఎన్నో ఆర్భాటాలుచేస్తున్నాయి. అనేక ప్రకటలు, గ్రామ సదస్సులు చేపడుతున్నారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. పల్లెల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయితే ఆ నిధులు సక్రమంగా వినియోగిస్తే ఇలా గ్రామాలు ఉండేవి కాదు. నాయకులు వారి స్వార్థంకోసం, వివిధ పనులు చేస్తామని ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు చేయించుకుంటారు. అవి మధ్యలోనే కలిగిపోతున్నాయి. మన మహానాయకులు గాంధీ కన్న కలలు ఇవేనా..అభివృద్ధి ఎక్కడ కనిపించదా.. అన్న సందేహాలు బి.పి.రాచపల్లె గ్రామాన్ని చూస్తేనే తెలిసిపోతుంది.

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : పల్లెలు అభివృద్ధి చెందాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. పల్లెల్లో చూస్తే అందుకు విరుద్ధంగా ప్రగతి కన్పిస్తోంది. మండల పరిధిలోని బి.పి.రాచపల్లె పెద్ద పంచాయతీ. అక్కడ కనీస వసతులు ప్రజలకు దూరమవుతున్నాయి. విద్య, వైద్య, అంతర్జాల సౌకర్యాలు రోజురోజులు దూరం అవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 60 సంవత్సరాలుగా ఉన్న తపాలా కార్యాలయాలన్ని అంతర్జాల సౌకర్యంలేదని పక్కన ఉన్న నాగవరానికి మార్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 10 గ్రామాల ప్రజలందరూ కార్యాలయం వద్ద ఇటీవల ధర్నా చేశారు.

◆ 8 సంవత్సరాలుగా పంచాయతీ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. సుమారు రూ.30 లక్షలతో ఏర్పాటు చేసి నిరుపయోగంగా వదిలేశారు.

◆కొన్నేళ్ల క్రితం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. అది శిథిలావస్థకు చేరుకుంది. వర్షంపడితే గదిలో నీళ్లు నిలుస్తాయి.

◆అంగన్వాడీ భవనం ఏర్పాటు చేసి 25 సంవత్సరాలైంది. ఆ భవనం నెర్రెలు చీలి కూలేందుకు సిద్ధంగా ఉంది.

◆ దశాబ్దం క్రితం ఏర్పాటు చేసి ఆరోగ్యఉపకేంద్రం పాడైపోయింది. ఇప్పటికీ కొత్త భవనం లేదు. భవనమే లేకుంటే ఆరోగ్యసేవలు ఎలా అందుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

◆ఉన్నత పాఠశాలలో గత ఐదు సంవత్సరాలుగా తెలుగు బోధించడానికి ఉపాధ్యాయుడు లేరు. అక్కడ పదోతరగతి విద్యార్థుల పరిస్థితి ఎంటి? వారికి పది పది పాయింట్లు ఎలా వస్తాయి? ప్రభుత్వ పాఠశాలలకు పిల్లను పంపాల వద్దా అనే సందేహాలు విద్యార్థుల తల్లిదండ్రులలో లేకపోలేదు. ఆ పాఠశాలకు కనీసం ప్రహరీ కూడా లేదు.

◆ బోరు నీరు తాగితే రోగాలు వస్తున్నాయని ఏపీఎండీసీ రూ.5 లక్షలు ఖర్చు చేసి శుద్ధికేంద్రం ఏర్పాటు చేసింది. అయితే ఏడాది అవుతున్నా ప్రారంభంకాలేదని స్థానికులు చెబుతున్నారు. ఇలా అనేక సమస్యలతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా అధికారులు స్పందించి పంచాయతీని అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.



వినియోగంలో లేని పశువుల బోను. ఆ గ్రామంలో గతంలో పశువైద్యశాల ఉండేది. ప్రస్తుతం అది కూడా లేకుండా పోయింది.

గ్రామంలో అన్నీ సమస్యలే



మా గ్రామంలో అన్ని సమస్యలే. సర్పంచిగా నన్ను ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీలైనంతవరకు సొంత నిధులు ఖర్చు చేసి కొన్ని సమస్యలు తీర్చాను. చాలా భవనాలు పాడైపోయాయి. ఎక్కువగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యం విషయంలోనూ ఇబ్బందే. అధికారులు స్పందించి ప్రభుత్వానికి నివేదికను పంపి వసతులను సమకూర్చే బాగుంటుంది. - **విజయభాస్కర్‌రాజు, గ్రామపంచాయతీ సర్పంచి, బి.పి.రాచపల్లె**

అభివృద్ధికి కృషి చేస్తాం



బి.పి.రాచపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయానికి మరమ్మతులు చేసి, ప్రహరీ ఏర్పాటు చేయాలని సర్పంచి అడిగారు. అయితే నిధులు అప్పుడు అందుబాటులేవు. ప్రస్తుతం నిధులను కేటాయించి ఆ పనులు చేస్తాం. అదే విధంగా విద్య, వైద్య, ఇతర సౌకర్యాల విషయంలో ఆయాశాఖాధికారులతో చర్చించి అందరం సమన్వయంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం. **-వెంకటసుబ్బయ్య, మండల అభివృద్ధి అధికారి, ఓబులవారిపల్లె**

మా గ్రామం పరిస్థితి ఏమిటి?



చర్చలకు దిగిన డేంజర్‌జోన్ బాధితులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన మంగంపేట ముగ్గురాయి అభివృద్ధికి కృషి చేసి స్థానికులను ఏపీఎండీసీ సంస్థ పట్టించుకోకపోవడం దారుణమని మండల ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, బాజపా నియోజకవర్గ బాధ్యుడు గల్లా శ్రీనివాసులు ఆరోపించారు. మంగంపేట పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామస్థులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి రెండేళ్లపాటు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. సంవత్సరాలు గడిచేకొద్దీ ఏపీఎండీసీ ఇచ్చిన హామీలను రద్దు చేసుకుంటూ వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 226 మందికి ప్రత్యేక ప్యాకేజీతో నెలకు 300 ఎగ్రేడ్ ఖనిజం కొద్ది కాలం ఇచ్చి నిలిపివేశారన్నారు. అదే విధంగా విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వడంలేదన్నారు. భూములు ఇచ్చిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. గతంలో గునిపాటి సోదరులు రామయ్య, కేశవులు ఉన్న సమయంలో మైనింగ్ నిలుపుదల చేసి డేంజర్‌జోన్ బాధితుల సమస్యలకు పరిష్కారం పొందేవారమన్నారు. ఆర్అర్-3, ఆర్-4 గ్రామాలలో రోడ్లు సమస్యలు, శుద్ధినీటి సమస్యలు ఉన్నాయన్నారు. ఏపీఎండీసీ వారి వాహనాలు తిరిగేందుకు ప్రత్యేకంగా రోడ్లు, దీపాలను ఏర్పాటు చేసుకుందే తప్ప గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని ప్రజలకు వారు హామీ ఇచ్చారు.

ప్రొటోకాల్ మరిచిపోతే ఎలా..?

రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన ప్రొటోకాల్ ఉంటుంది. అలాంటి ఏపీఎండీసీ ఎండీ వస్తే ప్రొటోకాల్ లేదని మంగంపేట సర్పంచి పెంచలయ్య పేర్కొన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన ఏపీఎండీసీ ఎండీ వెంకటయ్య చౌదరి ఒక్కిడ్ పాఠశాల, ఏపీఎండీసీ కార్యాలయం వద్ద జెండాను ఎగరవేశారన్నారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న ముఖ్యనాయకులు, పారిశ్రామికవేత్తలను ఎలాంటి సమాచారం లేకుండానే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో స్థానిక పారిశ్రామికవేత్తలు అనుమలగుండా చంద్రమోహన్, కల్లా చలపతి, రమణ, గల్లా నారాయణ, మల్లికార్జున పాల్గొన్నారు.

ఇంజినీరుపై దాడికి యత్నం

◆ అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

రైల్వేకోడూరు: గాలేరు - నగరి ప్రాజెక్టులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న అబ్బూరి శ్రీనివాసులు తనపై బయనపల్లెకు చెందిన కస్తూరి శివయ్యానాయుడు గడికోట భక్తవత్సలం అనే వ్యక్తితో కలిసి దౌర్జన్యం చేసి దాడికి యత్నించినట్లు బుధవారం సామాజిక మాధ్యమాల ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈయన ఇటీవల గుంజనేటి పోరంబోకు స్థలాల ఆక్రమణలపై చరవాణిద్వారా సందేశాలతో ఫిర్యాదులు పంపుతున్నారు. రెవెన్యూ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయడంతో ఆర్.ఐ. ఫణికృష్ణ, వీఆర్వోలు భుజంగేశ్వరరావు, ఈశ్వరయ్య ఆక్రమణలను పరిశీలించడానికి వెళ్లారు. అక్కడి హద్దురాళ్లు, ఆక్రమణలను పరిశీలించారు. తనకు చెందిన ఏబీఎన్ కల్యాణమండపం నిర్మాణంలో కూడా ఆక్రమణలు ఉన్నాయని, వాటినికూడా వెనక్కు తీసుకోమని శ్రీనివాసులు అధికారులకు చెబుతున్నారు. ఇంతలో పైన పేర్కొన్న వ్యక్తులు అక్కడికి చేరుకుని తనను కొట్టడానికి ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. చొక్కా జేబు చించేసి వస్తువులు, కాగితాలను విసిరి కొట్టారన్నారు. రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఇంజినీరు ఆవేదన వ్యక్తంచేశారు.

కాలిబాటలతోనే తెగుళ్లు దూరం

రెడ్డిపల్లె(పుల్లంపేట), న్యూస్‌టుడే: వరి సాగులో కాలిబాటల పద్ధతి పాటించడంతో తెగుళ్లు దరి చేరవని ఏవో చైతన్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లె లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వరిసాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగులో కాలిబాటల పద్ధతిని పాటిస్తే ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. రసాయనిక మందులు పిచికారి చేసేందుకు సులభతరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రోజా, రైతులు పాల్గొన్నారు.



వరి సాగుపై రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో చైతన్య

భూమి సమస్యపై ఎస్పీకి ఫిర్యాదు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తమకు చెందిన భూమిని అక్రమించి తమపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారంటూ ఓబులవారిపల్లె మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన మల్లు నారాయణరెడ్డి, ఆయన కుమార్తె కౌసల్య ఎస్పీ బాబూజీ అట్టాడకు ఫిర్యాదు చేశారు. బుధవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్లో వారు ఆయనను కలిశారు. 1914లో తమ పూర్వీకులకు 8.5 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. ఆ స్థలాన్ని ఒక మైన్స్ అండ్ మినరల్స్ యజమాని ఆక్రమించినట్లు చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయాన్ని పూర్తిగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆయన సీఐ సాయినాథ్‌కు సూచించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రంగనాథయ్య

పుల్లంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు కోడిగుడ్లు అందించాలని ఎంఈవో రంగనాథయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక మెయిన్ పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెను ప్రకారమే భోజనం అందించాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాల సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారని పాఠశాల స్థాయి మెరుగుపడాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటిష్ఠ ప్రణాళికలతో ప్రజారక్షణ



సీసీ కెమెరాల గదిని ప్రారంభిస్తున్న ఎస్పీ బాబూజీ అట్టాడ... కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పటిష్ఠమైన ప్రణాళికా విధానంతో ప్రజారక్షణకు పోలీస్‌వ్యవస్థ కృషిచేస్తుందని జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ పేర్కొన్నారు. బుధవారం ఆయన రైల్వేకోడూరుకు విచ్చేశారు. ఇక్కడి పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల కంట్రోల్ గదిని ప్రారంభించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. జిల్లాలో ఏర్పాటుచేసిఉన్న అన్ని కెమెరాలకంటే రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన వ్యవస్థ పటిష్ఠంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్పీ రాక సందర్భంగా సీఐ సాయినాథ్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఏపీఎండీసీ సీపీవో కేదార్‌నాథరెడ్డి, బెనర్జీ, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎంవీ. కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అవిసెన నరసింహారెడ్డి, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యసంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్. శ్రీనివాసులు, వైవీయు పాలకమండలి సభ్యుడు ముత్యాల పెంచలయ్య, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు తాతంశెట్టి నరసింహప్రసాద్ తదితరులను పిలిపించారు. ఎంపీఎండీసీ తరపున సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆ సంస్థ ఎండీ సహకారంతో రూ. 9,23,000 అందించినట్లు చెప్పారు. మిగతావారు కూడా తమకు వీలైనంతమేర ఆర్థికసహకారం అందించడంతో మొత్తంగా ప్రజల సహకారంతోనే నిఘా వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు ఎస్పీకి వివరించారు. తమ ఊరి రక్షణకోసం తలోచెయ్యివేసి సహాయపడడం అభినందనీయమని ఎస్పీ వారిని మెచ్చుకున్నారు. అందరినీ శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ప్రజాసహకారంఉంటే శాంతిభద్రతల పరిరక్షణ సులభతరమవుతుందని చెప్పారు. పట్టణానికి రక్షణ కల్పించడంలో కృషిచేస్తున్న సబ్‌ఇన్స్‌పెక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు.

మంత్రి వ్యాఖ్యలు సరికాదు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులపట్ల అనుచితంగా మాట్లాడడం సరికాదని జడ్పీటీసీ సభ్యురాలు మారెళ్ల రాజేశ్వరి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్ అతిథిగృహంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దళితులు సరిగ్గా చదువుకోరు, శుభ్రంగా ఉండరు, మంచిగా బతకరంటూ మంత్రి మాట్లాడడం ఆ వర్గాలను అవమానపరచడమేనన్నారు. ఇందుకు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. దేశ ప్రథమపౌరుడిగా దళితుడిని ఎన్నుకున్న ప్రభుత్వంలో ఇలాంటి మంత్రులుండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రవి కుమార్, సుబ్రమణ్యం, వెంకటరమణ పాల్గొన్నారు.

సీడీపీవో ట్యాబ్ మాయం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు సీడీపీవో సుజామణి శాఖాపరంగా ఉపయోగించే ట్యాబ్ బుధవారం మధ్యాహ్నం కార్యాలయంలో మాయమైంది. ఈ విషయాన్ని పీడీకి చెప్పగానే ఆయన పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయమన్నట్లు ఆమె చెప్పారు. సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అయితే అధికారులు ఎస్పీల సమావేశంతో తీరికలేకుండా ఉండడంతో ఆమె ఫిర్యాదు చేయలేకపోయారు. గురువారం ఈ విషయాన్ని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువస్తామన్నారు.

వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

రాజంపేట, న్యూస్‌టుడే : వసతిగృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతుల్లేకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రశాంత్ పేర్కొన్నారు. వసతిగృహ నిద్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని పలు వసతి గృహాలను ఆ సంఘం నాయకులు పరిశీలించారు.

శతకంతో చెలరేగిన ధరణి కుమార్

● పృథ్వీప్రశాంత్‌కు అయిదు వికెట్లు ● హోరాహోరీగా అండర్-16 క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: అండర్-16 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కడప వైఎస్ఆర్ఆర్-ఎసీఏ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో నెల్లూరు జట్టు భారీ స్కోరు చేసి మ్యాచ్‌పై పట్టు బిగించింది. 251/7 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 278 (120.3 ఓవర్లలో) పరుగుల వద్ద ఆలౌట్ అయింది. నెల్లూరు జట్టు బ్యాటింగ్‌లో ఫర్హాద్ 70 పరుగులు (12 ఫోర్లు) చేశాడు. చిత్తూరు జట్టు బౌలింగ్‌లో దీపక్ రామానుజ నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 78.5 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. దీంతో రెండో రోజు నెల్లూరు జట్టు 42 పరుగుల ఆధిక్యం సాధించింది. చిత్తూరు బ్యాటింగ్‌లో అచ్యుతానంద 31 పరుగులు (6 ఫోర్లు) చేస్తే ధరణి కుమార్ 117 పరుగులతో చేసి తన జట్టును పోటీలో నిలిపాడు. ఇందులో 20 ఫోర్లు ఉండడం విశేషం. నెల్లూరు జట్టు బౌలింగ్‌లో మాధవ్ మూడు వికెట్లు, తౌషీఫ్, సుబ్రమణ్యం చెరో రెండు వికెట్లు తీశారు.



చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్

విశాఖపట్నం లక్ష్యం 94 పరుగులు : కేవీఎస్ఆర్ఎం మైదానంలో విశాఖపట్నం, తూర్పుగోదావరి జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో 85/6 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు 108 (68.3 ఓవర్లలో) పరుగుల వద్ద ఆలౌట్ అయింది. విశాఖ జట్టు బ్యాటింగ్‌లో సుశీల్ 31 పరుగులు (4 ఫోర్లు), శ్రీకర్ 24 పరుగుల (2 ఫోర్లు)తో నాటౌట్‌గా నిలిచారు. తూర్పుగోదావరి జట్టు బౌలింగ్‌లో సంజయ్ ఒక్కడే అయిదు వికెట్లు తీసి విశాఖ జట్టు పతనానికి నాంది పలికాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పు గోదావరి జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 66.5 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌట్ అయింది. తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్‌లో యశ్వంత్ 44 పరుగులు నాటౌట్ (7 ఫోర్లు), పాండు రంగరాజు 36 పరుగులు (3 ఫోర్లు)తో రాణించారు. విశాఖపట్నం జట్టు బౌలింగ్‌లో శ్రీకర్ 4 వికెట్లు, నికిలేశ్వర్, నితీష్ కుమార్ చెరో 2 వికెట్లు తీశారు. దీంతో 94 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విశాఖపట్నం జట్టుకి ఆదిలోనే చుక్కెదురైంది. విశాఖ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి కేవలం అయిదు పరుగులకే 4 వికెట్లు జారవిడుచుకొని పీకల్లోతు కష్టాల్లో పడింది. తూర్పుగోదావరి జట్టు బౌలింగ్‌లో సందేశ్, సూర్య చైతన్య చెరో రెండు వికెట్లతో విశాఖ టాప్ ఆర్డర్ పతనాన్ని శాసించారు.



చిత్తూరు బ్యాట్స్‌మెన్ ధరణి కుమార్



పృథ్వీ ప్రశాంత్ కుమార్

స్కోరు వివరాలు : తూర్పు గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్- 64/10, విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్- 108/10, తూర్పుగోదావరి జట్టు రెండవ ఇన్నింగ్స్- 137/10, విశాఖపట్నం జట్టు రెండవ ఇన్నింగ్స్- 5/4

కృష్ణ ఘన విజయం

కేవోఆర్ఎం మైదానంలో కృష్ణ, పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో కృష్ణ జట్టు అద్భుత విజయాన్ని సాధించింది. అంతకు ముందు 14/3 పరుగుల ఓవర నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు 103 (49 ఓవర్లలో) పరుగుల వద్ద ఆలౌట్ అయింది. పశ్చిమ గోదావరి జట్టు బ్యాటింగ్‌లో తేజ 49 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కృష్ణ జట్టు బౌలింగ్‌లో పృథ్వీ ప్రశాంత్ కుమార్ అయిదు వికెట్లు, మనాస్ మూడు వికెట్లుతో పశ్చిమ గోదావరి జట్టు పతనాన్ని శాసించారు. అనంతరం 87 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కృష్ణ జటు వికెట్ నష్టపోకుండా 87 పరుగుల చేసి ఘన విజయం సాధించింది. కృష్ణ జట్టు బ్యాటింగ్‌లో పవన్ 47 పరుగులు (ఆరు ఫోర్లు), అనంత కార్తికేయ 34 పరుగుల (4 ఫోర్లు)తో నాటౌట్‌గా నిలవడం విశేషం.

స్కోరు వివరాలు : పశ్చిమగోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్ - 111/10, కృష్ణ జట్టు మొదటి ఇన్నింగ్స్- 128/10, పశ్చిమ గోదావరి జట్టు రెండవ ఇన్నింగ్స్- 103/10, కృష్ణ జట్టు రెండవ ఇన్నింగ్స్- 87/0

కార్యకర్తలే వైకాపాకు మూలస్తంభాలు

వేంపల్లె, న్యూస్‌టుడే: కార్యకర్తలే వైకాపాకు మూలస్తంభాలని సినీనటి, నగరి ఎమ్మెల్యే ఆర్.కె.రోజా అన్నారు. బుధవారం ఆమె పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలసి వేంపల్లెలో పర్యటించారు. స్థానిక సాయినగర్‌లో జరిగిన వేంపల్లె మండలాధ్యక్షుడు మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డి కుమార్తె సాయిరజితరెడ్డి, సంబేపల్లె మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉపేంద్రారెడ్డి కుమారుడు అనిరుద్‌రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్ సతీమణి వై.ఎస్.భారతిరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, రాయచోటి, పీలేరు ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడి, రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, జడ్పీ ఛైర్మన్ గూడూరు రవి, మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోతోందన్నారు. ఎన్నికల సందర్భంగా తెదేపా అధినేత ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా సంఘాలకు పూర్తిస్థాయిలో రుణమాఫీ వంటి హామీలు నెరవేరలేదన్నారు. ఎన్నికలప్పుడు ప్రజల ఓట్ల కోసం తెదేపా అధినేత హామీలివ్వడం, తర్వాత వాటిని తుంగలో తొక్కడం మామూలేనన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైకాపా విజయం సాధించి తీరుతుందన్నారు. అక్కడ జరిగే ప్రతిపక్షనేత జగన్ సభలకు జనం భారీగా హాజరవుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్‌రెడ్డి, గడికోట ద్వారకనాథరెడ్డి, వై.ఎస్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపీపీ కుమార్తె వివాహానికి తెదేపాకు చెందిన శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్ రెడ్డి, వేంపల్లె సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు పుత్తా నరసింహారెడ్డి, దేవగుడి నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర సహకారబ్యాంకు అధ్యక్షుడు అనీల్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.



వధూవరులతో జగన్ సతీమణి భారతి, ఎమ్మెల్యే రోజా తదితరులు

పులివెందుల ఏఎస్పీగా కృష్ణారావు బాధ్యతల స్వీకారం

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల ఏఎస్పీగా బి.కృష్ణారావు బుధవారం స్థానిక తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పులివెందుల అర్బన్ సీఐ ప్రసాద్, పులివెందుల రూరల్ సీఐ రామకృష్ణుడు, సిబ్బంది ఆయనకు పూలగుత్తి అందించి స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్‌లో బాధ్యతలు నిర్వహించి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. అంతకుముందు పులివెందులలో ఏఎస్పీగా పనిచేసిన అన్బురాజన్ తూర్పుగోదావరి జిల్లాకు ఓఎస్డీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు అందిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పులివెందుల ఏఎస్పీగా కృష్ణారావు బాధ్యతలు చేపట్టారు.

నేడు చేనేతలకు అవగాహన

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహనకు చర్యలు చేపట్టినట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు జయరామయ్య ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు జమ్మలమడుగు, వేపరాల, మైలవరం ప్రాంతాల్లో ఉన్న చేనేత కార్మికుల కోసం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో సదస్సు ఉంటుందన్నారు. 18న బద్వేలు ప్రాంత చేనేత కార్మికులకు బద్వేలు (పోరుమామిళ్ల రోడ్డు)లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసే సదస్సుకు అప్పరాజుపేట, తిరువెంగళాపురం, సురేంద్రనగర్, బద్వేలు, భావనారాయణ నగర్, అట్లూరు ప్రాంత కార్మికులు హాజరు కావాలన్నారు.

గిరిజన ముంపువాసులపై వివక్ష

అన్నీ ఉన్నా పరిహారం చెల్లించరట ● కలెక్టరుకు ఫిర్యాదు చేసిన గిరిజనులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గండికోట ముంపు పరిహారంలో గిరిజనులకు అన్యాయం చేస్తున్నారంటూ గండికోట ఏకలవ్యనగర్ వాసులు బుధవారం జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కడపలో కలెక్టరును కలిసి పలు సమస్యలను ఆయన ఎదుటుంచారు. కొండాపురం మండలం ఓబన్నపేట ఏకలవ్య నగర్‌లో సుమారు 30 కుటుంబాల వరకు ఉన్నారని వారంతా వివిధ పనుల నిమిత్తం సమీపంలో లభించే వస్తువులు తయారు చేసుకుని హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో విక్రయాలు చేసుకుంటూ ఉంటున్నామని అయితే మా పిల్లలు మాత్రం ఇక్కడి పాఠశాలల్లోనే చదువుతున్నారని మాకు రేషన్‌కార్డు, ఆధార్ కార్డులన్నీ ఉన్నాయన్నారు. అయితే మాకు పరిహారం చెల్లించేందుకు అధికారులు కుంటిసాకులు చెబుతూ మాకు పరిహారం అందించకుండా ఉన్నారన్నారు. కొంతమంది అధికారులను ఇదేంటని ప్రశ్నిస్తే మీ కొచ్చే పరిహారంలో సగం ఇస్తే అన్నీ చేస్తామని చెప్పారంటూ ఆరోపించారు. వీరి సమస్యలను విన్న కలెక్టర్ బాబూరావునాయుడు ఆర్డీవో దేవేంద్రరెడ్డికి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు జ్యోతి, శేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరుకు సమస్యను వివరిస్తున్న గండికోట ఏకలవ్యనగర్ కాలనీ వాసులు

ఇక్కడా 'బోరు'మనాల్సిందేనా!

(మొదటిపేజీ తరువాయి) సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఇది ఒక్క గుంటూరు జిల్లాలోనే కాదు.. అన్ని జిల్లాల్లోనూ ఈ సమస్య ఉంది. మన జిల్లాలోనూ అనేక బోర్లు నోర్లు తెరిచి ఉన్నాయి. మరి ఆ తెరిచిన వాటి పరిస్థితి ఏమిటి.. దీనికి ప్రభుత్వ యంత్రాంగమే రాయాల్సిన అవసరం లేదు.. అధికారులే ఆ పని చేయాలని లేదు. ప్రతి దానికి ప్రభుత్వాలే రావాలంటే మళ్లీ గుంటూరు సంఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఇదేమంత సమస్య కాదు.. వాటిని పూడ్చేందుకు యువత, స్థానిక నేతలు, ముఖ్యంగా గ్రామ ప్రజలు దృష్టి సారిస్తే చాలు. ప్రమాదకర బోరు బావుల పూడ్చేందుకు యువత సిద్ధం కావాల్సి ఉంది.

● జిల్లాలో సాగు నీటి కోసం రైతులు విపరీతంగా బోర్లు వేస్తున్నారు. వాటిలో నీళ్లు పడని సందర్భంలో పూడ్చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. ఇవే ప్రమాదకరంగా మారుతున్నాయి. మంచినీటి కోసం వినియోగించే బోర్లయితే నాలుగున్నర అంగుళాలు వేసుకుంటారు. అదే సాగునీటి కోసం అయితే ఎక్కువ మంది ఆరున్నర అంగుళాల బోర్లు తవ్వుతారు. ఈ బోర్లు వేసినప్పుడు కేసింగ్ (పైపులు)ను ప్రారంభం నుంచి ఎక్కడి వరకు వేస్తారో అక్కడి వరకు తొమ్మిది అంగుళాలు వెడల్పుతో వేయాల్సి ఉంటుంది. నీళ్లు పడని సందర్భంలో దాన్ని తీసేసి గుంతను అలాగే ఉంచుతున్నారు. దీంతో అవి వర్షం నీటితో కోతకు గురై క్రమ క్రమంగా పెద్ద గుంతగా మారుతున్నాయి. చిన్నారులు తెలియక వీటివైపు వెళ్లి వాటిలో పడిపోతున్నారు.

● జిల్లాలోని పులివెందుల, యర్రగుంట్ల, రాజంపేట, రైల్వేకోడూరులో భూగర్భ జలాలు లోతులో ఉండటం, ఆయా ప్రాంతాల్లో బొగ్గు, నల్లరాయి, ముగ్గు రాయి, సున్నపురాయి, బైరటీస్, ఆస్‌బెస్టాస్ తదితర ఖనిజాలు ఉండటంతో నీళ్లు పడే అవకాశం తక్కువ. దీంతో వందల అడుగుల లోతు వరకు వెళ్తుంటారు. నీళ్లు పడని వాటిని పూడ్చేయడం కూడా చాలా తక్కువ. ఇలా వృథాగా వదిలేసిన బోర్లను వెంటనే పూడ్చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామాల్లో, రోడ్డు పక్కన, పంట పొలాల్లో ఏమైనా బోర్లు ఉంటే వాటి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు.

60 వేలకు పైగా బోర్లు : బోర్లు.. ఎవరు.. ఎక్కడ.. ఎందుకు వేస్తున్నారనే లెక్క లేదు. అందులో వృథాగా ఉన్న బోర్ల గురించి అసలు తెలియదు. నీటి సంరక్షణ, భూగర్భ జలాలు తక్కువగా ఉన్న మండలాల్లో బోర్లు వేయడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం వాల్టా చట్టం తీసుకొచ్చింది. ఇది అమలు కావడం లేదు. జిల్లాలో వ్యవసాయ బోర్లు 60 వేలకు పైగా ఉంటాయని అధికారుల అంచనా. బోరులో నీళ్లు పడనట్లయితే వాటిని వెంటనే మూసేయాలని నిబంధన ఉంది. కొందరైతే సాగు నీటిని ఎక్కువ మొత్తంలో వినియోగించుకోవాలనే ఆశతో ఆరున్నర లేదా అంత కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బోర్లను వేస్తున్నారు.

నిర్లక్ష్యంగా వదిలేస్తే జరిమానా విధించాలి : ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో చెప్పలేం. ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న బోరు బావులను పూడ్చకుండా వదిలేసే యజమానుల పట్ల కఠినంగా వ్యవహరించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలి. క్రిమినల్ కేసులు నమోదు చేసేలా యజమానులు అప్రమత్తంగా ఉంటారు.

ఇలా అమలు చేస్తే ఫలితం ఉంటుంది

బోర్లు వేసే వాళ్లంతా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా బోర్లు వేస్తే భారీ జరిమానా విధించాలి. గ్రామాల వారీగా వృథాగా ఉన్న బోర్లపై సర్వే నిర్వహించి, వెంటనే పూడ్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ బాధ్యతల్ని క్షేత్రస్థాయిలో వీఆర్వో, గ్రామ కార్యదర్శి, సర్పంచులకు అప్పగించాలి. ప్రస్తుతం నీళ్లు పడకపోయినా తర్వాత వస్తాయని అనుకుంటే కేసింగ్ అలాగే ఉంచి బోరు చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలి. బోరు ఇక పనికి రాదనుకుంటే పూడ్చివేయాలి.

యువత ముందుకు రావాలి : గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో యువత పాలుపంచుకోవాలి. గ్రామంలో వృథా బోర్లను గురించాలి. ప్రమాదకరమైన వాటిని మూసేస్తే ఓ మంచి పని చేసిన వారవుతాం. ఎక్కువ మొత్తంలో మట్టి, లేదా ఇంకా మిషనరీ అవసరం అనుకుంటే వెంటనే అధికారులకు తెలపాలి. అధికారులు కూడా వారికి సాయంగా ఉండి అది పూడ్చే వరకు పర్యవేక్షించాలి. సాగు భూముల్లో కూడా అక్కడక్కడ ప్రమాదకర బోర్లు ఉంటాయి. కూలీ పనులకు వెళ్లే వారు తమ చిన్న పిల్లలను ఇంట్లో వదిలేయలేని పరిస్థితుల్లో తమతో పాటు పొలానికి తీసుకెళ్తారు. వారు ఆడుకుంటూ ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. రైతులు స్పందించి వృథా బోర్లను స్వయంగా మూసేయాలి.

పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం..

ప్రభుత్వ ఆదేశాలు వస్తే వృథాగా ఉన్న బోర్లను పూడ్చేందుకు ఆదేశాలు జారీ చేస్తాం. జరిగిన కొన్ని సంఘటనలు వల్ల మేము కూడా అప్రమత్తంగా ఉన్నాం. అనేక గ్రామాల్లో అధికారులు పర్యటించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో వృథాగా ఉండి, ప్రమాదకరంగా ఉన్న బోర్లకు సంబంధించిన సమాచారం వీఆర్వో, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

-పి.సంజీవరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

యువతకు సందేశం ఇస్తాం..

జిల్లాలో యువజన సంఘాలకు వృథాగా ఉన్న బోర్లను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని సందేశం పంపిస్తాం. మండలాలు, గ్రామాల వారీగా ప్రమాదకరంగా ఉన్న కొన్ని బోర్లను అక్కడ స్థానికంగా ఉన్న యువత ముందుగా గుర్తించి పూడ్చేయాలి. . లేదా అధికారులకు సమాచారం అందించాలి. వాటి చిత్రాలను తీసి పంపిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

- మమత, జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి

కాశినాయనలో భూకబ్జాలపై విచారణకు ఆరు బృందాలు

(మొదటిపేజీ తరువాయి) బ్రహ్మంగారిమఠం తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌వోలచే విచారణ ప్రారంభిస్తామని తహసీల్దార్ ఉదయ్ సంతోష్ తెలిపారు. ఒక్కొక్క బృందంలో తహసీల్దార్, సర్వేయర్, ఇద్దరు వీఆర్‌వోలు, 2 వీఆర్‌ఏలు ఉంటారని చెప్పారు. ఈ బృందాలు ఆయా గ్రామాల్లో జరిగిన భూఅక్రమాలపై సమగ్ర విచారణ జరిపి జిల్లా కలెక్టర్ బాబురావు నాయుడుకు నివేదికను అందించనున్నారు. ప్రథమంగా గురువారం అక్కింగుండ్ల గ్రామ పొలాలలో విచారణ ప్రారంభిస్తామని, గ్రామంలో పొలం ఉన్న రైతులందరూ తమ వద్దనున్న భూ అర్హత పత్రాలు, రేషన్, ఆధార్ కార్డులతో పొలాల దగ్గర ఉండి, విచారణకు వచ్చిన అధికారులకు చూపించాలని తహసీల్దార్ ఉదయ్ సంతోష్ తెలిపారు.

గణితోపాధ్యాయుడి ఘనకీర్తి



● సాంకేతికతతో ఆదర్శంగా బోధన ● జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక

● రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒకే ఒక్కడు ● సెప్టెంబరు 5న రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతి ప్రదానం

వైఎంఆర్ కాలనీ (ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన గణిత ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయిలో ఘనకీర్తి దక్కింది. వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేసి, సాంకేతికత ద్వారా సమస్యలను సాధించే విధానం కనిపెట్టిన ఆయనకు గురుపూజోత్సవం రోజున దేశ ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి అవార్డును అందచేయనున్నారు. ప్రొద్దుటూరు గ్రామీణ మండలం దొరసానిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కంభం వెంకటేష్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపియ్యారు. ఆయన విద్యారంగానికి చేసిన, చేస్తున్న విశేష కృషిపై 'న్యూస్‌టుడే' కథనం.



తరగతి గదిలో డిజిటల్ తెరపై బోధిస్తూ..

నేపథ్యం : మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన కంభం వెంకటేష్ అదే గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983 నుంచి 1988 వరకు ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుకున్నారు. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1988-90 సంవత్సరాల్లో ఇంటర్ విద్యను పూర్తి చేశారు. పులివెందుల లయోలా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశారు. 1995లో ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బీఈడీ పూర్తి చేశారు. 1996లో డీఎస్సీ పరీక్షకు ఎంపికై సెకండరీ గ్రేడ్ స్కూల్ టీచరుగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ముద్దనూరు మండలం పెనికపాడు ప్రాథమిక పాఠశాలలో ప్రథమంగా పనిచేశారు. తర్వాత 2000లో తాళ్లమాపురం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. 2009లో ఈయనకు పదోన్నతి లభించింది. ప్రస్తుతం పనిచేస్తున్న దొరసానిపల్లె పాఠశాలలో గణిత అధ్యాపకుడిగా పనిచేశారు. అక్కడి నుంచి చాపాడు మండలం చిన్నగురవలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈయన ఇక్కడ పనిచేస్తున్నప్పుడే విద్యార్థులకు నిత్య నూతనంగా బోధించాలన్న ఆలోచన మొగ్గ తొడిగింది. దాతల సహాయం తీసుకుని చిన్నగురవలూరు జడ్పీలో ప్రొజెక్టరు, తెర, కంప్యూటర్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా గణితంలో అతిక్లిష్టమైన సమస్యలను కూడా ఎలా గుర్తుంచుకోవాలో విద్యార్థులకు బోధించే వారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తు కూడా ఈ పాఠశాల నుంచే పంపారు. ఈనెల మొదటి వారంలో జరిగిన పదోన్నతుల్లో మళ్లీ తిరిగి దొరసానిపల్లె పాఠశాలకే ఆయన బదిలీ అయ్యారు.

విద్యపట్ల ఆసక్తి కలిగించేందుకే : గణితం అంటే చాలా మంది విద్యార్థుల్లో అదోరకం బెరుకు ఉంటుంది. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో ఇదీ మరీ ఎక్కువ. సాధారణంగా నల్లబోర్డుపై ఉపాధ్యాయులు ఎంత సులువుగా గుర్తుపెట్టుకునే విధానంలో చెప్పినా వెంటనే మరిచిపోతుంటారు. వినూత్నంగా సాంకేతికను జోడించి బోధిస్తే బాగుంటుందని ఆలోచించి అందుకు కావాల్సిన పరికరాల్ని ముందుగా సిద్ధం చేసుకున్నా. ఖర్చు ఎక్కువ కావడంతో దాతల సహాయంతో కొనుగోలు చేశాం. ప్రొజెక్టరు ద్వారా తెరపై కంప్యూటర్ సాయంతో క్లిష్టమైన సమస్యల్ని సైతం సులువుగా ఎలా సాధించాలో నేర్పించాం. దీన్ని గుర్తించిన ప్రభుత్వం 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రకటించింది. నాటి జిల్లా విద్యాశాఖాధికారి ప్రతాపరెడ్డి చేతుల మీదుగా జిల్లా అవార్డును అందుకున్నా. ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకున్నా. నా బోధనా పద్ధతిని మెచ్చుకున్న కేంద్ర మానవ వనరుల శాఖ ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు నన్ను ఎంపిక చేసింది. ఆ అవార్డును సెప్టెంబరు 5న రాష్ట్రపతి చేతుల మీదుగా అందిస్తారు. ఎంతో ఆనందంగా ఉంది. దీంతో నాపై బాధ్యత మరింత పెరగనుంది. విద్యా శాఖాధికారులందరికీ కృతజ్ఞతలు.

-కంభం వెంకటేష్, గణిత ఉపాధ్యాయుడు, దొరసానిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రొద్దుటూరు.

మత సామరస్యానికి ప్రతీక కడప

కలసిమెలసి పండగలు చేసుకోవాలి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: మనమందరం తొలుత భారతీయులం.. తరువాత కులాలు పుట్టుకొచ్చాయని కడప డీఎస్పీ మాసూంబాషా అన్నారు. కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం కడపలోని శాంతి కమిటీ ఆధ్వర్యంలో కడపలోని ముస్లిం-హిందూ మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కడప మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఈ స్థాయిలో ఇంత మంది హాజరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో జరగబోయే వినాయకచవితి, బక్రీద్ పండగలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కడపలో అన్ని మతాల వారు సోదరుల్లా కలసిమెలసి ఉంటారని పేర్కొన్నారు. కడప కులమతాలకు అతీతమనే విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వినిపించాలన్నారు. ఇలాంటి ఐక్యత మరెక్కడ ఉండదన్నారు. భవిష్యత్తులో కూడా ఇలానే ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కోరారు. ఏ ఒక్క కులాన్ని కించపరిచే విధంగా వ్యవహరించరాదని చెప్పారు. శాంతియుతంగా మెలగాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డితో పాటు ఎస్సైలు, ముస్లిం-హిందూ మతపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ మాసూంబాషా

కరవు కడప.. కన్నీటి గడప!

(మొదటిపేజీ తరువాయి) సింహాద్రిపురం, పులివెందుల ప్రాంతంలో చీనీచెట్లు నీరు లేక ఎండిపోయాయి. ట్యాంకర్లతో తడులు అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పినా ఫలితం కరవైంది. మార్కెట్‌లో పంటలకు ధర లేకపోవడమూ రైతులను నష్టపరచింది. చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి ప్రాంతాల్లో వందల ఎకరాల్లో బంతి, చేమంతి సాగు చేసి గిట్టుబాటు ధర లేక ట్రాక్టర్లతో దున్నేశారు. ఉల్లి, టమోటా పంటను పశువులకు మేతగా వదిలేశారు. ఇలా కరవు. . గిట్టుబాటు ధరల లేమితో రైతుల అల్లాడిపోయాయి.

ఈ ఏడాదీ కష్టమే : ఈ ఏడాది కూడా కరవు ఛాయలు కమ్ముకుంటున్నాయి. రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, గాలివీడు, సంబేపల్లి, లక్కిరెడ్డిపల్లి తదితర చోట్ల సమస్య కనిపిస్తోంది. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లోనూ ఆనవాళ్లు ప్రస్ఫుటమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ప్రస్తుతం కరవును అధ్యయనం చేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎప్పటికప్పుడు నివేదించాలన్న ఆదేశాలు ఇచ్చారు. ఆ క్రమంలోనే ఇప్పటివరకు జిల్లాలో వచ్చిన కరవుల తీరుతెన్నులు వివరిస్తూ ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక ఇచ్చారు. అందులోని అంశాలను పరిశీలిస్తే రైతుల దయనీయ పరిస్థితి తెలుస్తుంది.

ఇదీ పరిస్థితి : గత పదహారేళ్ల కాలంలో (2001-2016) తొమ్మిది కరవులు సంభవించాయి. 16 ఏళ్లలో 9 ఏళ్లు 8 మండలాల్లో కరవు సంభవించింది. గాలివీడు, కొండాపురం, లక్కిరెడ్డిపల్లి, పెనగలూరు, పులివెందుల, సంబేపల్లి, కాశినాయన, వీరపునాయునిపల్లి ఈ జాబితాలో ఉన్నాయి. వీటిలో జిల్లాలోనే తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ నీటిచుక్క లేక పంట నష్టం జరిగింది. ఉపాధి కరవైంది.

* 8 ఏళ్ల పాటు 14 మండలాల్లో కరవు వచ్చింది. ఇవి రెండో దశలో ఉన్న మండలాలుగా నమోదయ్యాయి. బి.కోడూరు, చిన్నమండెం, చిట్వేలు, కలశపాడు, లింగాల, ముద్దనూరు, మైలవరం, నందలూరు, పెండ్లిమర్రి, పుల్లంపేట, రాజంపేట, సింహాద్రిపురం, తొండూరు, వీరబల్లి ఈ జాబితాలో చోటుదక్కించుకున్నాయి. పెట్టుబడీ దక్కని స్థితిలో రైతులు, నిరుపేదల వ్యథ వర్ణనాతీతం.

* 7 ఏళ్లపాటు 12 మండలాల్లో కరవు వచ్చినట్లు నివేదికలో చూపారు. బి.మఠం, చక్రాయపేట, కమలాపురం, కోడూరు, పోరుమామిళ్ల, రామాపురం, రాయచోటి, సిద్ధవటం, టి.సుండుపల్లి, వల్లూరు, వేముల, యర్రగుంట్ల సదరు జాబితాలో నమోదయ్యాయి.

* 6 ఏళ్లపాటు 9 మండలాల్లో కరవు ఛాయలు కనిపించాయి. అట్లూరు, బద్వేలు, చింతకొమ్మదిన్నె, గోపవరం, జమ్మలమడుగు, ఓబులవారిపల్లి, రాజుపాలెం, వేంపల్లి, ఒంటిమిట్ట ఆ జాబితాలో నమోదయ్యాయి.


* 5 ఏళ్లపాటు 3 మండలాల్లో మాత్రమే కరవు కమ్ముకుంది. అవి దువ్వూరు, రాజంపేట, పెద్దముడియంగా అధికారులు పేర్కొన్నారు. ఇందులో దువ్వూరు, పెద్దముడియం ప్రాంతంలో కేసీకెనాల్ కొంత ఊరటగా ఉండటంతో తీవ్రస్థాయి క్షామ పరిస్థితులు నెలకొనలేదు.

* 4 ఏళ్ల పాటు 4 మండలాల్లో కరవు కష్టం చూపింది. ఆ జాబితాలో చాపాడు, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాలు ఉన్నట్లు గుర్తించారు.

* మూడేళ్ల పాటు కరవు నెలకొన్న మండలంగా ఒక్క చెన్నూరు మాత్రమే నమోదైంది. ఇక్కడే జిల్లాలోనే తక్కువగా కరవు పరిస్థితి కనిపించాయి. కడపలోనూ నాలుగేళ్లు కరవు ఉన్నట్లు స్పష్టం కాగా.. అంతకంటే తక్కువగా చెన్నూరు నిలిచి ప్రత్యేకత చాటింది.

క్షేత్రస్థాయిలో అధ్యయనం : కరవు పరిస్థితులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నాం. ఇప్పటికే శాఖల పరంగా సమీక్ష సమావేశాలు నిర్వహించాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక కరవు నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. ముందు జాగ్రత్తల్లో భాగంగా ఏం చేయాలన్న దానిపైనా చర్చ జరుగుతోంది. రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

-బాబూరావునాయుడు, జిల్లా కలెక్టర్





రాజంపేట పట్టణం వత్తలూరు మార్గంలోని కావులూరి సుబ్రహ్మణ్యంనాయుడు నివాసంపై ఏర్పాటు చేసిన గాలిమర

గాలిమరకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

గాలి ఉందంటే.. వెలుగు ఉన్నట్లే!

రాజంపేట, న్యూస్‌టుడే : రోజురోజుకు విద్యుత్తు వాడకం పెరిగిపోతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గృహోపకరణాలు, వంట సామగ్రితో చాలా వరకు విద్యుత్తుతో పనిచేసేవే అధికంగా ఉంటున్నాయి. పేదల నుంచి ధనవంతుల వరకు వీటిని వినియోగించే వారు పెరిగిపోతుండటంతో కరెంటు అవసరం ఉత్పత్తిని మించిపోతోంది. ఫలితంగా కోతలు విధించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందుకే ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సౌర, పవన విద్యుత్తు తయారీ ఉపకరణాలకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. చాలామంది సౌర విద్యుత్తు పలకాలను ఇళ్లపై ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు భిన్నంగా రాజంపేట పట్టణం వత్తలూరు మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నివసిస్తున్న కావులూరు సుబ్రహ్మణ్యంనాయుడు తమ ఇంటిపై సౌర వ్యవస్థతో కూడిన గాలిమరను ఏర్పాటు చేసుకున్నారు. గత ఆరునెలలుగా వారింటి విద్యుత్తు అవసరాలను పూర్తిగా ఇదే తీరుస్తోందని చెబుతున్న ఆయన.. ఇందుకైన వ్యయం.. ఉపయోగాలను వివరిస్తున్నారిలా..


వ్యయం.. ప్రయోజనం ఇలా..

సౌర, పవన విద్యుత్తు పరికరాలతో కూడిన ఈ వ్యవస్థను అయిదేళ్ల క్రితం రూ.10 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్నట్లు సుబ్రహ్మణ్యంనాయుడు చెబుతున్నారు. ప్రస్తుతం ఇది రూ.7 లక్షలకు వచ్చేసింది. 2.5 మీటర్ల వేగంతో గాలిమర తిరిగితే 0.6 యూనిట్లు చొప్పున రోజుకు 12 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. గాలిమరకు అనుసంధానంగా ఏర్పాటు చేసుకున్న సౌర పలకాల ద్వారా రోజుకు 15 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఈ రెండింటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తు ఇంటి అవసరాలకు సరిపోతోంది. ఎక్కువైనా అప్పటి వరకు విద్యుత్తు సమస్యలుండలేదు.

● ఈ గాలిమరను ఏర్పాటు చేసుకునేందుకు ముందు తమ ఇంటికి నెలకు రూ.10 వేల వరకు విద్యుత్తు బిల్లు వచ్చేది. ప్రస్తుతం చాలావరకు విద్యుత్తు అవసరాలను ఇదే తీరుస్తోంది. దీంతో కరెంటు బిల్లు రూ.2 వేల లోపే వస్తోంది. పెట్టుబడి ఎక్కువైనా దీర్ఘకాలంలో చాలా ప్రయోజనాలు ఉంటాయి. ప్రస్తుతం పెద్దపెద్ద భవనాలు నిర్మించుకుంటున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. ప్రస్తుతం ధరలు కూడా తగ్గాయి. అయిదారేళ్లలో మిగిలిపోయే విద్యుత్తు బిల్లులు వీటికి పెట్టిన ఖర్చును తీర్చేస్తాయి. అంటే ఆ పైన ఏళ్లపాటు ఉచితంగా విద్యుత్తును పొందవచ్చు. వీటి నిర్వహణ కూడా సులభమే. విద్యుత్తు సరఫరాలో నాణ్యత పెరుగుతుంది. కోతల వెతలు ఉండవని చెబుతున్నారు సుబ్రహ్మణ్యంనాయుడు.



ఒకే గ్రామం.. రెండు మండలాలు



వీరబల్లి మండలానికి చెందిన వీధి



సుండుపల్లి మండల వీధి

వీరబల్లి మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ సీతంపేట చిన్న గ్రామం. ఊరు మొత్తం 70 ఇళ్లు ఉండగా రెండు వీధులు ఉన్నాయి. ఈ రెండు వీధులు సైతం ఒకటి వీరబల్లి మండలంలో ఉండగా రెండోది సుండుపల్లి మండల పరిధిలో ఉండటం ఇక్కడి ప్రత్యేకత. అయితే ప్రత్యేకతతో పాటు ఇదే గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. ఇళ్లన్నీ పక్క పక్కనే ఉన్నప్పటికీ మండలాలు వేరు కావడంతో ఏ సమస్య తలెత్తినా ఒక వీధి వారు మండల కేంద్రం సుండుపల్లికి చేరాలంటే 20 కిలోమీటర్లు వెళ్లాలి. మరో వీధివారు 25 కి.మీ ప్రయాణిస్తేగాని వీరబల్లికి వెళ్లలేరు.

- వీరబల్లి, న్యూస్‌టుడే

ప్రకృతి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి. హరితాంధ్రప్రదేశ్ సాకారం కావాలనేది నా అభిమతం. ఆకాంక్ష కూడా. వినాయక చవితికి మట్టి బొమ్మలను పూజించాలి. పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత. ప్రకృతిని కాపాడుకోవాలి. ఎక్కడా రసాయన పదార్థాలతో రూపొందించిన ప్రతిమలు పెట్టకుండా మన్నుతో తయారు చేసిన వాటినే ఎక్కువగా ఏర్పాటు చేయాలి. సహజ తత్వ మట్టితో తయారై కొలువైన ఏకదంతుడి పూజతో పవిత్రత పెరుగుతుంది. శక్తి ఎక్కువగా ఉంటుంది. విఘ్నేశ్వరుడి దీవెనలు, ఆశీస్సులు మెండుగా ఉంటాయి. అందరూ పర్యావరణ హితం కాంక్షించి మట్టి విగ్రహాలనే పెట్టాలి.

- ఈనెల 15న తిరుపతి తారకరామ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న మాటలివి.



మట్టితో తయారు చేసిన ఏకదంతుడి ప్రతిమలు

రసాయనాల రంగులతో ఎన్నో అనర్థాలు

జిల్లాలో మితిమీరుతున్న పీవోపీ వినియోగం

కడప గడపలో మట్టి గణపతికే జై కొట్టాలి

గణపతి బొప్పా మోరియా.. ప్రకృతి హితం కోరయా..

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే

గణపతి సమగ్ర స్వరూపం. ఎన్నో సందేశాల సమాహారం. ఆధునిక జీవన గమనానికి మార్గదర్శి. బలం, ఆనందం, జ్ఞానం, ఐశ్వర్యం కలగలిసిన స్వరూపమే గణనాథుడు. చవితి ఉత్సవాలు సమీపిస్తుండటంతో.. వక్రతుండ మహాకాయ పత్రి పూజలు అందుకునేందుకు సిద్ధం అవుతున్నారు. చిట్టి బొమ్మ నుంచి భారీ విభిన్న ఆకృతుల్లో ఎన్నెన్నో రంగుల్లో రూపొందించిన ప్రతిమలు కనువిందు చేస్తున్నాయి. ఎత్తయిన విగ్రహాలు, మెరిపించే, మురిపించే వర్ణాలెన్నో. వీటి తయారీలో రసాయనాల వినియోగం క్రమేణా శ్రుతిమించింది. ఇదే పర్యావరణానికి పెను సవాల్ విసురుతోంది. భారత సనాతన సంప్రదాలన్నీ ప్రకృతి హితం కోరేవే. అందుకే సహజ మట్టితో చేసిన మట్టి గణపతికే జైకొడదాం. పర్యావరణ హితాన్ని కాంక్షిద్దాం. అందుకు ఇదే సరైన తరుణం.

జోరందుకున్న సన్నాహాలు..

జిల్లాలో 2011 గణన ప్రకారం 7,06,204 కుటుంబాలు ఉన్నాయి. 28,82,469 మంది జనాభా ఉన్నారు. వీరిలో హిందువులు 23,91,231 మంది జీవనం సాగిస్తున్నారు. ఈనెల 25న వినాయక చవితి పండుగను వేడుకలా చేయాలని ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఊరూరా.. వాడవాడలో మండపాలను ఏర్పాటు చేసి ప్రతిమలను తెప్పించి పూజలు చేయాలని ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. నేటి సాంకేతిక యుగంలో రసాయన రంగుల హంగులపై ఆసక్తి చూపుతున్నారు. వీధుల్లో పెట్టడానికి ఒక్కొక్క విగ్రహం కోసం రూ.5 వేల నుంచి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టేందుకు వెనకాడటం లేదు. భారీ విగ్రహాలు, అందమైన రంగుల ప్రతిమలు కొనుగోలు చేసేందుకు నువ్వానేనా అన్నట్లు యువకులు పోటీ పడుతున్నారు.

విషతుల్యం.. మనుగడకు విఘాతం

రసాయనాల వినియోగంతో తయారుచేసిన విగ్రహం చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. నీటిలో నిమజ్జనం చేసిన తర్వాత విషతుల్యం అవుతుంది. చెరువులు, కుంటలు, కాల్వల్లో వేస్తే అడుగు భాగం గచ్చుగా మారుతుంది. పీవోపీలో వాడే కాల్షియం సల్ఫేటు నీటిలో కరగడానికి 3-4 ఏళ్లకుపైగా పడుతుంది. పైగా కాల్షియం పెరిగేకొద్దీ నీటి బరువు, గాఢత పెరుగుతుంది. ఈ జలాన్ని తాగితే పక్షవాతం, మెదడువాపు, నరాల బలహీనత వచ్చే ప్రమాదం ఉంది. జుట్టు రాలడం, థైరాయిడ్ సమస్యలు వెంటాడతాయి. అలంకరణకు వాడే రంగులు ఎంతో దుష్ప్రభావం చూపిస్తాయి. మెగ్నీషియం, లెడ్, ఆర్సినిక్, కోబాల్ట్ ఆక్సైడ్, క్రోమియం ఆక్సైడ్ తదితర మిశ్రమాలు వాడుతారు. మెగ్నీషియం నరాల వ్యవస్థను దెబ్బతీస్తుంది. లెడ్, కాడ్మియంతో రక్తంలో మార్పులు వస్తుంటాయి. గుండె సంబంధిత జబ్బులు ఎదురవుతాయి. ఆర్సినిక్ ప్రభావంతో ఎముకలు, మూత్రపిండాలు పాడయ్యే ప్రమాదం పొంచి ఉంది. మెలిగ్నంతో నరాలు, మెదడు, ఫెరిక్సా ఆక్సైడ్, క్రోమియం, కోబాల్ట్ ఆక్సైడ్‌తో కాలేయం, కిడ్నీలకు ముప్పు పొంచిఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పీవోపీ అణువణువు విషతుల్యం కావడంతో జీవుల ఆయుష్షు క్షీణిస్తుందని చెబుతున్నారు.

* పీవోపీ, రసాయనాల రంగులు జలచరాలను హరించేస్తున్నాయి. నీటిలో సంచరించే జీవుల మనుగడను ప్రశ్నార్థకరం చేస్తున్నాయి. పోగు పడిపోతున్న కర్బన పదార్థాలు, భారీ లోహాలు పరిమితికి మించి చేరి నీటి అడుగున ఉండే ప్రాణులకు హాని కలిగిస్తున్నాయి. ఈ హానికర రసాయన అవశేషాలు చేపల శరీరంలోకి చేరి వాటిని ఆహారంగా తిన్న తర్వాత మన శరీరంలోకి వచ్చి అనేక వ్యాధులను కలుగజేసే ప్రమాదం ఉంది. అదేవిధంగా ఈ నీరు భూమిలోకి ఇంకి శ్వాస, రుధిర సమస్యలు ప్రబలే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు

ప్రభుత్వం నిషేధించాలి



పూర్వం ఏ పల్లెలో చూసినా మట్టి పరిమళం వెదజల్లేది. ఊర్లో కుంట, చెరువు, కాల్వలో బంక మన్ను తీసుకొచ్చి వినాయకుడి ప్రతిమను చేసేవారు. ఊరంతా ఉమ్మడిగా సంబరంగా చేసుకునేవారు. ఆధునిక యుగంలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. వీధి వీధినా మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. పోటీ ఎక్కువైంది. ఎవరి విగ్రహం పెద్దది అనే చర్చ జరగాలనే దృక్పథంతో ఖర్చుకు వెనకాడటం లేదు. ఏ బొమ్మ చూసినా రసాయానాలే. ఎన్నో రంగులతో కనిపిస్తున్నాయి. వీటితో మరెన్నో అనర్థాలు ఉన్నాయి. దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. పర్యావరణాన్ని కాంక్షించేలా పండుగల పరమార్థం ఉండాలి. ఇందుకు భిన్నంగా నేటితరం ప్రకృతిని కాలుష్యం కోరల్లోకి నెట్టేసే రసాయనాలతో తయారు చేసిన వాటిని తెస్తున్నారు. ఇలాంటివి తయారు చేయకుండా ప్రభుత్వం నిషేధం విధించాలి.

- వేంపల్లి లక్ష్మిరెడ్డి, విశ్రాంత సంయుక్త సంచాలకుడు, ఉద్యాన శాఖ, కడప

పర్యావరణ గణపతి స్మరామి



ఆకర్షణీయమైన రంగులతో మెరిసిపోయే విగ్రహాలను చూసి నేటితరం మైమరచిపోతోంది. ఉత్సవాలకు, పండుగలన్నీ ప్రకృతి హితాన్ని కోరేవే. ధగధగల వెనక దుష్ప్రభావాన్ని గుర్తించాల్సి బాధ్యతను పక్కన పెట్టేయడమే ఆందోళన కలిగిస్తోంది. రంగులు, రసాయనాల వాడకం పెరిగిపోతోంది. ఇవి ఎన్నో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ప్రకృతికి ఎన్నో ప్రయోజనాలు కల్పించాల్సిన వినాయక చవితి ఉత్సవాలు మానవ తప్పిదాలతో పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే తిరిగి అలనాటి సహజ ప్రతిమల సంప్రదాయాన్ని పునరుద్ధరించాలి. పీవోపీతో అటు మనుషులు, ఇటు పశువులు, జలచరాలకు హాని కలుగుతోంది. అందుకే ప్రతిఒక్కరూ మట్టి గణపతికి జైకొట్టాలి.

- డాక్టరు ఎ.వీరయ్య, సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు



తోటపాళెం చిన్నోడు.. దర్శకత్వంలో మెరిశాడు

◆ నాటక దర్శకత్వంలో మేటి సాయిసందీప్

◆ ప్రతిభను వరించిన నంది బహుమతి

◆ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు ఎంపిక

నందలూరు, న్యూస్‌టుడే : నాటక రంగంలో విశేష ప్రతిభ చూపుతూ ప్రశంసలు.. బహుమతులతో సత్తా చాటుతున్నాడు నందలూరు మండలం తోటపాళెంకు చెందిన యువకుడు బి.సాయిసందీప్. ఈ యువకుడు బీఏ వరకు చదివాడు. సేవా కార్యక్రమాల్లో పాల్పంచుకోవాలనే తపనతో ఏడో తరగతిలోనే స్థానిక రైల్వే బాపూజీ స్కౌటు గ్రూపులో చేరాడు సందీప్. ఈ సేవా దళం లీడరు బి.ఎం.బాషా స్ఫూర్తితో రంగస్థలంవైపు అడుగేశాడు. ఆయన పర్యవేక్షణలోనే పలు సాంఘిక సందేశాత్మక నాటకాల్లో చిన్నారులతో కలిసి నటించాడు. ఈ క్రమంలో పిల్లలకు నటనపై మెలకువలను నేర్పించేవాడు. స్కౌటు గ్రూపు లీడరు బి.ఎం.బాషా సూచనలతో దర్శకత్వ విభాగంపై దృష్టిపెట్టాడు. మంచి ప్రతిభ చూపాడు. అదే అతనికి రాష్ట్ర ఉత్తమ దర్శకుడుగా నంది అవార్డులను తెచ్చిపెట్టింది. దర్శకత్వ విభాగంలో కాకుండా అతను ప్రదర్శించిన సందేశాత్మక స్వచ్ఛభారతి నాటిక నాలుగు నంది అవార్డులను కైవసం చేసుకొంది. ఇదే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో ఏడాది పాటు శిక్షణ పొందే అవకాశాన్ని తెచ్చిపెట్టింది.

◆ 2015లో కడప జిల్లా నెహ్రూ యువ కేంద్రం నుంచి బెస్ట్ వలంటరీ అవార్డును, పురస్కారాన్ని పొందాడు.

◆ 2015లో రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ వారు తిరుపతి శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించిన బాలల నంది నాటక పోటీల్లో సందీప్ దర్శకత్వంలో స్వచ్ఛభారతి సందేశాత్మక సాంఘిక నాటికను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సందీప్ ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డును అందుకొన్నాడు. ఇదే నాటిక మరో మూడు విభాగాల్లో కూడా నంది అవార్డులు గెలుచుకుంది.

◆ రైల్వే బాపూజీ స్కౌటు గ్రూపు తరపున రాష్ట్రస్థాయిలో దాదాపు పది సాంఘిక నాటికలను ప్రదర్శించారు. అందులో మనసుల్లో మహాత్ముడు, స్వచ్ఛభారతి, బంగారుకొండ, వసంతోత్సవ కళ నాటికలకు సాయి సందీప్ దర్శకత్వం వహించారు. వీటిలో స్వచ్ఛభారతి, బంగారుకొండ నాటికలకు అవార్డులు లభించాయి.

పౌరాణిక పద్యాలే దర్శకున్ని చేశాయి

నేను రెండో తరగతి చదివే వయసు నుంచి మా తాత పౌరాణిక నాటకాల్లోని పద్యాలు నేర్పించారు. వాటిని వేదికలపై పాడేవాడిని. ఆ పద్యాలు అప్పట్లో నాకు బహుమతులను తెచ్చిపెట్టాయి. అప్పటి నుంచి నాలో వేదిక అంటే భయంపోయింది. దాంతో నటుడు కావాలన్న కోరిక కలిగింది. ఆ సమయంలో రైల్వే బాపూజీ స్కౌటు గ్రూపు వారు ప్రదర్శిస్తున్న బాలల నాటకాలను చూసి అందులో చేరాను. స్కౌటు గ్రూపు నాయకుడు బద్వేలు మస్తాన్‌బాషాను స్ఫూర్తిగా తీసుకొని ఆయన వద్ద నటన, దర్శకత్వంలో మెలకువలు నేర్చుకొన్నా. ఆయన సూచనల మేరకు బాలలతో నాటికలను సాధన చేయిస్తూ దర్శకుడిని అయ్యాను. పాఠశాల స్థాయిలో చిల్డ్రన్స్ ఆర్ట్స్ థియేటర్‌ను ఏర్పాటు చేసి చిన్నారుల్లో కళా ప్రతిభను వెలికితీయాలని లక్ష్యంగా ఎంచుకొన్నాను. నటనలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో మరిన్ని మెలకువలు నేర్చుకునే అవకాశం రావడం ఆనందంగా ఉంది.

- బి.సాయిసందీప్, రైల్వే బాపూజీ స్కౌటు గ్రూపు సభ్యుడు, నందలూరు



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నంది అవార్డు అందుకొంటున్న సాయిసందీప్



43 నగదు అవార్డులు, ఏడు ఉత్తమసేవా పతకాలు

తాజాగా వరించిన రాష్ట్రపతి పోలీసు విశిష్టసేవా పతకం

ఇదీ పటాలం కమాండెంటు రాజాకిషోర్ బాబు ప్రస్థానం

పోలీసుశాఖలో ఉద్యోగం కత్తిమీద సాములాంటిది. సేవకు పర్యాయపదం. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకం. ఇలాంటి ఉద్యోగంలో చేరి.. అంకితభావంతో సేవలందించి.. వృత్తికే వన్నె తెచ్చారు. ఆరంభం నుంచి ప్రజా సేవే లక్ష్యంగా కృషి, పట్టుదలతో రాణించారు. సమాజంలో మంచి గుర్తింపు పొందారు. మూడు దశాబ్దాల కాలంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఉన్నత స్థానాలు చేరుకున్నారు. రాష్ట్రస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు పలు అవార్డులు, రివార్డులు అందుకున్నారు.. కడపకు చెందిన రాజాకిషోర్‌బాబు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు వ్యవస్థలో పనిచేస్తున్న ఆయన.. సిద్దవటం శివారులోని ఏపీఎస్పీ పదకొండో పటాలంలో కమాండెంటుగా విధులు నిర్వర్తిస్తున్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతిలో సీఎం చేతులమీదుగా రాష్ట్రపతి పోలీసు విశిష్టసేవా పతకం అందుకున్న సందర్భంగా ఆయన ఉద్యోగ ప్రస్థానం మీకోసం..

దళపతి.. సేవలతో ఉన్నతి



కుటుంబసభ్యులతో రాజాకిషోర్‌బాబు



కొసావో కమిషనర్ నుంచి అంతర్జాతీయ పతకం అందుకుంటూ..



సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్రపతి పోలీసు విశిష్టసేవా పతకం అందుకుంటూ..

సిద్దవటం, న్యూస్‌టుడే : రాజాకిషోర్‌బాబు స్వస్థలం కడపలోని ఎర్రముక్కాపల్లె. తల్లి అమ్మణ్ణమ్మ, తండ్రి పిచ్చయ్య. విద్యార్థి దశలో రాజాకిషోర్‌బాబు స్థానిక సాయిపేట పురపాలిక పాఠశాలలో ప్రాథమిక విద్య చదివారు. రామకృష్ణ పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. కడపలో ఇంటర్ పూర్తిచేసి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ఉత్తీర్ణత చెందారు. అనంతరం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో స్నాతకోత్తర పట్టా అందుకున్న ఆయన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో మానవహక్కులపై పీజీ డిప్లొమా పొందారు. గ్రూపు-2 పరీక్షలకు శిక్షణ పొంది 1985లో పరీక్ష రాసి ఎస్సైగా ఎంపికయ్యారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..

1985లో ఎస్సైగా ఎంపికైన రాజాకిషోర్‌బాబు అనంతపురంలో శిక్షణ పొందారు. 1986- 87 మధ్య ఎస్సైగా జహీరాబాద్‌లో విధులు చేపట్టారు. 1990లో నాంపల్లిలో, 1991లో పంజాగుట్ట, ఇంటలిజెన్స్ విభాగాల్లో సేవలందించారు. 1992లో సీఐగా పదోన్నతి పొంది తిరుపతి ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. 1995 సొంత జిల్లా కడపకు బదిలీ అయ్యారు. 2005లో నాంపల్లి ట్రాఫిక్ విభాగంలో, 2007లో డీఎస్పీగా పదోన్నతి పొంది విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. అనంతరం మెదక్ జిల్లా రామచంద్రాపురం డీఎస్పీగా పనిచేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ కేంద్ర విభాగ నిఘా ఏసీపీగా విధులు నిర్వహించారు. 2011లో ఏఎస్పీగా పదోన్నతిపై తిరుపతి ప్రాంతీయ నిఘా విభాగంలో పనిసిన అనంతరం తనిఖీ విభాగానికి మారారు. 2014లో ఎస్పీగా పదోన్నతి పొందారు. హైదరాబాద్ ఇంటలిజెన్స్ పరిపాలన విభాగం ఎస్పీగా వెళ్లి సేవలందించారు. ఇక్కడి నుంచి మన జిల్లాలోని సిద్దవటం ఏపీఎస్పీ పదకొండో పటాలానికి కమాండెంటుగా వచ్చారు.

సాహసాలే సోపానాలుగా..

అనంతపురంలో ఎస్సైగా చేరిన రాజాకిషోర్‌బాబు అడుగడుగునా విధుల్లో సాహసాలకు మారుపేరుగా నిలిచారు. కడపలో సీఐగా పనిచేస్తున్న రోజుల్లో ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ దళానికి ఎంపికయ్యారు. 2008లో యుగోస్లేవియా దేశంలోని కొసావోలో జాతుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. అక్కడ శాంతిభద్రతలను కాపాడేందుకు మన దేశం నుంచి ప్రభుత్వం పంపిన 120 మంది పోలీసు అధికారుల్లో రాజాకిషోర్‌బాబు ఒకరు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 47 దేశాల రక్షణ విభాగం అధికారులతో కలిసి ఏడాది పాటు ఆయన సేవలందించారు. 2000లో విజిలెన్స్‌లో పనిచేసే రోజుల్లో ఎన్నో రాజకీయ ఒత్తిళ్లను అధికమించారు. మిర్యాలగూడలో అక్రమంగా నిల్వచేసిన రూ.6 కోట్ల ధాన్యాన్ని సీజ్‌చేశారు. తిరుపతిలో ఏఎస్పీ హోదాలో పనిచేస్తూ కడపలో రూ.25 కోట్ల విలువైన పప్పుధాన్యాలు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు పౌర సరఫరాల సంస్థ గోదాంపై దాడులు చేసి రూ.1.6 కోట్ల విలువైన నిత్యావసరాలను పట్టుకున్నారు. నక్సల్స్ పేరు చెప్పి దోపిడీలకు పాల్పడిన ముఠాను చాకచక్యంగా పట్టుకున్నారు. 15 మంది బాలికలకు వ్యభిచారం కూపం నుంచి విముక్తి కల్పించడం, ఐక్యరాజ్య సమితి శాంతి దళంలో భారతదేశం తరపున పనిచేసే అవకాశం లభించడం ఆయన ఉన్నతికి కారణమయ్యాయి.

పతకాల పంట..

మూడు దశాబ్దాల పైబడిన ఉద్యోగ జీవితంలో ఎన్నో పతకాలు కైవసం చేసుకున్నారు. 1998లో రాష్ట్రపోలీసు సేవా పతకం అందుకున్నారు. 2000లో కోసావో ఆ దేశ పతకం, 2003లో రాష్ట్ర ప్రభుత్వ పోలీసు ఉత్తమసేవా పతకం, 2005లో రాష్ట్రపతి శౌర్యం, 2009లో రాష్ట్రపతి పోలీసు మెడల్, 2013లో రాష్ట్ర ప్రభుత్వ మహోన్నత సేవా పతకం పొందారు. 2016లో రాష్ట్రపతి ఉత్తమ పురస్కారం పొందారు. ఆంధ్రప్రదేశ్ సీఎంలు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య చేతులమీదుగా ఉత్తమ సేవా పతకాలు అందుకున్నారు. మొత్తంగా ఏడు ఉత్తమ సేవా పతకాలు, 43 నగదు రివార్డులను అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈయన రాష్ట్రపతి పోలీసు విశిష్టసేవా పతకానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఈనెల 15న తిరుపతిలోని తారకరామ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం యుడు చేతులమీదుగా పతకం అందుకున్నారు.



కోసావోలో జోర్డాన్ దేశానికి చెందిన సహ ఉద్యోగితో విధుల్లో..

కష్టపడితేనే ఉన్నతి సాధ్యం

ఏ రంగంలోనైనా కష్టపడి పనిచేస్తేనే ఎవరికైనా మంచి గుర్తుంపు లభిస్తుంది. ప్రజలకు సేవ చేయాలనే తపనతోనే పోలీసు రంగంలోకి వచ్చాను. ప్రజా పోలీసు అన్పించుకోవాలనే కాంక్షతోనే ఎస్సై హోదా నుంచి ఎంత కష్టమైన పని ఎదురైనా నిబద్ధతతో చేశాను. లక్ష్యం ఏర్పరచుకుని కృషి, పట్టుదలతో పని చేశాను. ఉన్నతస్థాయికి చేరుకోవడంతో పాటు ఎన్నో అవార్డులు, రివార్డులు పొందాను. తాజాగా రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పురస్కారం అందుకోవడం మర్చిపోలేని అనుభవం. మా శాఖలో పనిచేసిన హోంగార్డులు, కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది సహకారం వల్లే ఇన్ని విజయాలు సాధించా.

- గగ్గుటూరు రాజాకిషోర్‌బాబు, కమాండెంటు, ఏపీఎస్పీ పదకొండో పటాలం, సిద్దవటం మండలం

పీజీ కోర్సులలో ప్రవేశాలు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో పీజీ కోర్సులు ఎంఏ తెలుగు, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ ఎంకామ్‌లలో చేరదలచిన విద్యార్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సుబ్బానరసయ్య ప్రకటనలో పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు, యాజమాన్య కోటాలో చేరదలిచిన విద్యార్థులకు కూడా పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



వినతిపత్రం సమర్పిస్తున్న అభావిప సభ్యులు

నకిలీ కళాశాలల అనుమతులు రద్దు చేయాలి

యోవేవి (కడప, న్యూస్‌టుడే): యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కో-కన్వీనర్ గంపా సుబ్బరాయుడు యోవేవి కుల సచివులు కె.చంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చాలా డిగ్రీ కళాశాలలు నకిలీ ధ్రువ పత్రాలతో తరగతులు నడుపుతున్నారని తెలిపారు. ఈ విధంగా తగతులు నడిపి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. తప్పుడు సమాచారంతో నడుపుతున్న కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలను పలుమార్లు సీడీసీ డీన్‌జె.దాము దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పు రాలేదన్నారు. గతంలో యోవేవి అధికారులు కొన్ని కళాశాలలు షోకాజు నోటీసులు పంపామన్నారు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటి వరకు ఎవరికీ తెలియదని తెలిపారు. అనుబంధ డిగ్రీ కళాశాలలు నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నా ఎందుకు చూస్తూ ఉన్నారని కుల సచివులను ప్రశ్నించారు. నియమ నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులు వెంటనే రద్దు చేయాలి, లేక పోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయి ప్రసాద్, మైనుద్దీన్, ఆజాద్, షేక్షావలి పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: షిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు..., 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: జగన్మోహిని (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': మునమువలు 'చెనా బీట్‌రూట్ మసాలా', మీచేతి వంట 'పాలకూకోడి కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ', జస్ట్ ఎ మినిట్ 'క్యాబేజ్ శాండ్‌విచ్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్-2(రిపీట్), 05-30: ఆడాళ్ళూ మజాకా! (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: జబర్దస్త్ జల్లాల్లైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేక్ ఫాస్ట్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
★ హెల్త్ & బ్యూటీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ.3:00, రా. 09:00)
★ జీవనరేఖ హెల్త్ కేర్ – (ఉ.09:30, మ.2:00, సా.04:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్ – సుఖ జీవనం (ఉ.10:00, మ.2:30, రా. 9:30).
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్తీ డయాబెటిక్ (మ.1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: మార్నింగ్ షో: అమ్మో బొమ్మ (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), **మధ్యాహ్నం:** 1-00: మాట్నీ: వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), **సాయంత్రం:** 4-00: ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్ (సత్యరాజ్, భానుప్రియ), **రాత్రి:** 7-00: ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో – ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫ్ అండ్ ఆలూ పరోటా, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చల్ల ఉండలు & స్వీట్ పనియారం, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – మంగుళూర్ బన్స్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పాలక్ రాజ్మా కర్రీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" – సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, మ.12.00: బెస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందూ క్యూసైన్) – గోవన్ కోకోనట్ కేక్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – పాలకాయలు, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కౌఫ్" సూపర్ చెఫ్ - పొట్లకాయ వడ కర్రీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఆచారి రోస్టెడ్ చికెన్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్పైసీ స్పెషల్) – ఆహారీ తుకా హప్పు & బోహెమియన్ డ్రెస్సింగ్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - శెనగల బిళ్ళల కర్రీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – తెలంగాణ చికెన్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ పకోడి, సా.5.15: స్నాక్స్ – టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 మంతారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 మంతారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాక్స్ (రిపీట్), 11-00 మంతారావం,11-30 ఐదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 మంతారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 మంతారావం, 02-35 సఖి, 03-00 మంతారావం, 03-30 సుఖీభవ: కడుపులో సునామీ... **సాయంత్రం:** 04-00 మంతారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం, 05-00 మంతారావం, 05-30 అంతర్యామి, 06-00 మంతారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 మంతారావం,07-30 ఐదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాక్స్, 11-00 మంతారావం,11-30 ఐదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 మంతారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 మంతారావం, 09-30 ఈటీవీ టాక్స్, 10-00 మంతారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 మంతారావం, 11-30 ఐదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 మంతారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 మంతారావం, 02-35 సఖి, 03-00 మంతారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 మంతారావం, 04-30 సుఖీభవ: కడుపులో సునామీ... 05-00 మంతారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 మంతారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 మంతారావం, 07-30 ఐదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 మంతారావం, 10-30 ఈటీవీ టాక్స్, 11-00 మంతారావం, 11-30 ఐదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 17-08-2017

SVBC: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగుం - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్రనామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టలక్ష్మి అనుగ్రహం శ్రీ మహాలక్ష్మి కిరణ్, 05-00 లైవ్ ఎస్.డి.సేవ + ప్రత్యేక వార్తలు, ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ మంటనాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం..

భక్తి TV: **ఉదయం:** 06-00 సాయిహారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మి నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీ వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 సాయిగీతామృతం, 06-00 సద్గురుస్తోత్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 సాయిహారతి, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: రెడీ, 11-00 కామెడీ ఖిలాడీలు (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడీ ఖిలాడీలు, 05-00 జైత్రయాత్ర ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీత, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తులసి.

maa: **ఉదయం:** 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దిన ఫలం - రాశి ఫలాలు, 08-30 పంచ్‌లైన్, 09-00 సినిమా: నమో వెంకటేశ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్ళామా, 12-30 చిన్నారి పెళ్ళికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 04-00 సినిమా: ఊహలు గుసగుసలాడే, **సాయంత్రం:** 05-30 ఒకే జానకి, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

GEMINI: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ముగ్గురు మొనగాళ్ళు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: పండంటికాపురం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు,10-00 సినిమా: శౌర్యం.

వర్షాకాలంలో వెనామీ సాగులో జాగ్రత్తలు

వెనామీ సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు పడితే బయటినీరు గుంతలోకి తీసుకోవడం తీవ్ర నష్టాలకు గురిచేస్తుంది. అక్వా రైతులు కొన్ని సూచనలు పాటిస్తే వేసవిలో మాదిరిగా సాగు చేసుకోవచ్చని ముత్తుకూరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.హరిబాబు తెలిపారు.



వెనామీ పెంపకానికి వర్షాకాలం అనుకూలం. కాని వాతావరణంలో ఎండ, వర్షం ఉన్నప్పుడు నీటిలోని ప్లవకాల్లో తేడా వస్తుంది. నీటి ఉష్ణోగ్రత, ఉదజని(పీహెచ్), కరిగి ఉన్న ప్రాణవాయువు వ్యత్యాసానికి గురైతే, రొయ్యలపై ఒత్తిడి ఏర్పడుతుంది. ఇలాంటి సమయాల్లో గుంతలో నీటిలోతు నాలుగు నుంచి ఐదు అడుగులు ఉండేలా చూసుకోవాలి. పిల్లలు వదిలే సమయం నుంచి ప్లవకాలు తగ్గకుండా ఏరియేటర్లు వాడుకోవాలి. దీంతో నీటిలో కరిగిన ప్రాణవాయువు కనీసం 5 పీపీఎం తగ్గకుండా ఉంటే, రొయ్యల్లో వ్యాధి నిరోధకశక్తి బాగుంటుంది. వర్షాకాలంలో.. వృథా మేత, రొయ్యలు విసర్జించే వ్యర్థాలతో మేలు చేసే బ్యాక్టీరియా సంఖ్య తగ్గిపోతుంది. పంట పూర్తి కాలంలో ప్రోబయాటిక్స్‌ను 3 నుంచి 4 దపాలుగా వాడుకోవడం వలన సహజ చర్యలు ఏర్పడుతాయి. నేల స్వభావాన్ని బట్టి ఉదజని తక్కువ ఉన్నప్పుడు సున్నం వాడుకోవచ్చు. కరిగి ఉన్న ప్రాణవాయువు స్థాయి పడిపోతే రొయ్యల్లో వైట్‌స్పాట్ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. అమోనియా వాయువులను స్థిరీకరించే బ్యాక్టీరియాను వృద్ధి చేసుకోవాలి. రొయ్యలు బలహీనపడిపోకుండా చూసుకుంటూనే విబ్రియో బ్యాక్టీరియా పెరుగుదలను నియంత్రించాలి. గుంతకు పరిసరాల్లో వైరస్ ప్రభావం ఉన్నపుడు బయటి నీటిని వాడకుండా జాగ్రత్తపడాలి. ఈ సమయంలో రసాయనాలు వినియోగించడం మరింత ప్రమాదం. విత్తనం వదిలిన 20 రోజుల నుంచి పట్టుబడి వరకు వైరస్ హాని పొంచి ఉంటుంది.

– న్యూస్‌టుడే, ముత్తుకూరు

కనకాంబరానికి పురుగుల బెడద

కనకాంబరంలో పురుగుల బెడద ఎక్కువని ఉద్యాన అధికారి ఎం.బబిత తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు.



నులి పురుగులు: ఇవి మొక్కల వేర్లకు రంధ్రాలు చేసి బుడిపెలను కలుగజేస్తాయి. దీని వల్ల వేర్లు నీటిని, పోషకాలను కావాల్సిన మేర మొక్కకు అందించలేవు. అందువల్ల ఆకులు ముడుచుకుని ఊదా రంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారతాయి. పూల పరిమాణం తగ్గుతుంది. నులి పురుగులు చేసిన రంధ్రాల ద్వారా శిలీంధ్రాలు వేర్లలోకి చేరి ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలు ఎండిపోతాయి.

నివారణ చర్యగా నులిపురుగులున్న పొలంలో కనకాంబరం పూలసాగు చేపట్టే ముందు, సూర్యరశ్మీకరణ చేయాలి. నాటేముందు ఎకరాకు 200 కిలోల వేపపిండి వేసుకోవాలి. నాలుగు కిలోల ఫోరేట్ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లాలి. నులిపురుగులు సోకిన మొక్కల్ని పెరికి నాశనంచేయాలి. బంతి పూలతో పంటమార్పిడి చేస్తే నేలలో నులిపురుగుల సంఖ్య తగ్గుతుంది.

పిండినల్లి: లేత కొమ్మలు, ఆకులు, పూమొగ్గలపై తెల్లని పొర కప్పినట్లుగా ఉండే పురుగులు గుంపులుగా చేరి రసం పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారి మొక్కలు గిడసబారతాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని బూజు పెరుగుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియ జరగక మొక్కల పెరుగుదల తగ్గుతుంది. నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని రెండుసార్లు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన నారు నాటడం లేదా సాగుచేసిన పొలంలో శిలీంధ్రాలు ఉండటం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ శిలీంధ్రానికి నులిపురుగులు తోడైనప్పుడు మొక్కలు తొందరగా ఎండిపోతాయి. ఆకులు ముందుగా కిందికి వాలుతాయి. తరువాత పసుపు రంగుకు మారి కొమ్మల చివర్లు కిందికి వంగుతాయి. మొదట వేర్ల చివర్ల వద్ద తర్వాత నేల మట్టం వద్ద కాండం కుళ్లిపోతుంది. దీన్ని కాండంకుళ్లు అంటారు. లీటరు నీటికి 3 గ్రాములు కాంటాప్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ భూమి తడిచేలా పోసి ఎండు తెగులును నివారించవచ్చు.

కరవు నివారణలో ప్రభుత్వం విఫలం

- జిల్లాలో కరవు విలయతాండవం
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. రామచంద్రయ్య




లక్కిరెడ్డిపల్లె మండలంలో వేరుసెనగ పంటను పరిశీలిస్తున్న సీపీఐ కరవు బృందం సభ్యులు.. విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కరవు విలయ తాండవం చేస్తూ ఉంటే నంద్యాల ఎన్నికల్లో ఒక్క సీటు కోసం 12 మంది మంత్రులు పనిచేయడం సిగ్గు చేటని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. రామచంద్రయ్య ఆరోపించారు. బుధవారం జిల్లాలో సీపీఐ రాష్ట్ర కరవు పరిశీలన బృందం రాయచోటికి చేరింది. స్థానిక ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా భూగోళ విస్తీర్ణం 15,35,900 హెక్టార్లుకు గాను సాగు విస్తీర్ణం 5,02,303 హెక్టార్లు అయితే నికర సాగు విస్తీర్ణం 4,05,276 హెక్టార్లు కాగా రుతు పవనాలు సకాలంలో ప్రవేశించి తగినంత వర్షపాతం నమోదైతే జిల్లా వ్యాప్తంగా ఏటా ఖరీఫ్‌లో వరి, వేరుసెనగ, పత్తి, మినుము, శనత, కంది, జొన్న, సజ్జ పంటలు సాగుచేస్తారన్నారు. గత పదేళ్లుగా సాధారణ సాగు విస్తీర్ణం అత్యధికంగా 3,07,103 లక్షల హెక్టార్లు, అత్యల్పంగా 1.54 లక్షలయితే ఈ ఏడాది తగినంద వర్షపాతం నమోదుకాక జిల్లాలో దాదాపు 26 మండలాల్లో 24 శాతం వర్షపాతం లోగు ఏర్పడి విత్తనమే పడలేదన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాలతో పోలిస్తే చివరి స్థానంలో కేవలం 25 శాతం మాత్రమే సాగైందన్నారు. రైతులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారన్నారు. గ్రామీణ రైతాంగం పెద్ద పెద్ద నగరాలకు వలసకూలీలుగా పోతున్నారన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని కోనంపేటలో ఎండిన మామిడి చెట్లను పరిశీలించామన్నారు. జిల్లాలోని రైల్వేకొండాపురం, సింహాద్రిపురం, పులివెందుల, వీరపునాయునిపల్లె, వేంపల్లె, చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె, రాయచోటి మండలాల్లో పర్యటించి జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. ఓబులేశు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పులి కృష్ణమూర్తి, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు చంద్ర, సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బసీరున్నీసా, జిల్లా మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, సీపీఐ ఏరియా కార్యదర్శి, సహాయ కార్యదర్శి విశ్వనాథ్, శ్రీనివాసులు, భవననిర్మాణ సంఘం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

రాయలసీమకు నికర జలాలను కేటాయించి ఆదుకోవాలి

కొండాపురం, న్యూస్‌టుడే: యుద్ధప్రాతిపదికపై కృష్ణా నది జలాలను పునర్ పంపిణీ చేసి రాయలసీమ ప్రాంతానికి నికర జలాలను కేటాయించి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఓబులేసు పేర్కొన్నారు. జిల్లాలో కరవును పరిశీలించేందుకు వచ్చిన సీపీఐ రాష్ట్ర పరిశీలన బృందం బుధవారం కొండాపురం నుంచి తమ పరిశీలన ప్రక్రియను ప్రారంభించింది. భవన నిర్మాణ కార్మిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు అన్ని మండలాల్లో తగినంత వర్షపాతం నమోదు కాక, మరోమారు రాష్ట్రం కరవు వాత పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపురంలో గండికోట ప్రాజెక్టు కింద మండలంలోని 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, మిగిలిన గ్రామాల్లో తాగడానికి నీరు కూడా లేదన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య మాట్లాడుతూ కరవు వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేలు, విత్తనాలు పడని రైతుకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూరుశాతం రాయితీపై విత్తనాలు ఇవ్వాలన్నారు. మండల పరిధిలోని పి. అనంతపురం, తిమ్మాపురం, చిన్నపల్లె, పొట్టిపాడు తదితర గ్రామ పొలాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల వెంకటరమణ పాల్గొన్నారు.

అమాంతం పెరిగిన నిత్యావసరాల ధరలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. బుధవారం ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగాయన్నారు. వచ్చిన వంద రోజుల్లోపు ధరలు తగ్గిస్తానని చెప్పిన ప్రధాన మంత్రి మోదీ మూడేళ్లయినా తగ్గించలేకున్నారన్నారు. సామాన్య ప్రజలు కొనుగోలు చేయాలంటే అవస్థలు పడుతున్నారన్నారు. అదే తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ధరలు అందుబాటులో ఉండేవన్నారు. పెద్ద నోట్ల రద్దుతో కూడా కొంత వరకు ఈ అవస్థలు వచ్చాయని అభిప్రాయ పడ్డారు. ఇక రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పేదలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, చార్లెస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్ చిత్రంలో పార్టీ నాయకులు

32 మండలాలకు ట్రిపుల్ ఐటీల్లో అదనపు సీట్లు

వేంపల్లె, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ పరిధిలోని కడప జిల్లాకు చెందిన 32 మండలాల విద్యార్థినీ, విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో అదనపు సీట్లు దక్కాయి. సూపర్ న్యూమరరీ కింద ఒక్కో మండలం నుంచి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 54 సీట్లు కేటాయించారు. అట్లూరు మండలానికి 2, బి.కోడూరుకు 1, బ్రహ్మంగారిమఠం - 2, బద్వేలు- 1, చక్రాయపేట - 2, చాపాడు- 2, చెన్నూరు- 2, చిన్నమండెం -1, చింతకొమ్మదిన్నె-2, దువ్వూరు మండలానికి 2 చొప్పున సీట్లు దక్కాయి. గోపవరం మండలానికి 2, కలసపాడుకు 2, కమలాపురం -1, ఖాజీపేట -1, కొండాపురం -1, లింగాల -2, ముద్దనూరు -1, మైలవరం -1, పెద్దముడియం -2, పెండ్లిమర్రి మండల విద్యార్థులకు 2 సీట్లు లభించాయి. పోరుమామిళ్ల మండలానికి 2, పుల్లంపేటకు 2, రాజుపాలెం 2, రామాపురం 2, కాశినాయన 2, సంబేపల్లె1, సిద్ధవటం2, తొండూరు 2, వీరపునాయునిపల్లె 2, వల్లూరు 2, వేముల 2, ఒంటిమిట్ట మండలానికి 1 లభించాయి. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 23న ఆయా ట్రిపుల్ ఐటీల్లో నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు డైరెక్టర్ ఆచార్య భగవన్నారాయణ, ఏవో అమరేంద్రకుమార్‌లు తెలిపారు.

ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు స్పందన

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆరు రవాణా శాఖ కార్యాలయాల్లో రవాణా ఆటో డ్రైవర్లకు బుధవారం నిర్వహించిన ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 804 మంది హాజరయ్యారు. డీటీసీ బసిరెడ్డి మాట్లాడుతూ.. రవాణేతర డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వారికి రవాణా డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు చాలా సులువుగా ఉంటుందన్నారు. గతంలో రవాణా ఆటో డ్రైవర్లకు ఎల్‌ఎల్‌ఆర్ ఇవ్వాలంటే 8వ తరగతి పాసై ఉండాలనే నిబంధన ఉండటంతో పెద్దగా ఎవరు ఎల్‌ఎల్‌ఆర్‌లు తీసుకోలేదని డీటీసీ చెప్పారు. ఇప్పుడు 8వ తరగతి పాసు కాకపోయినప్పటికి డ్రైవర్ వ్యక్తిగతంగా డిక్లరేషన్ దరఖాస్తు ఇస్తే సరిపోతుందన్నారు. దీంతో మేళాకు భారీ సంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు. కడపలో 153 మంది, ప్రొద్దుటూరు-66, రాజంపేట-117, రాయచోటి-190, పులివెందుల-123, బద్వేలు-155 మంది హాజరైన ఎల్‌ఎల్‌ఆర్‌లు తీసుకున్నారని చెప్పారు. రవాణాఆటో డ్రైవర్ లైసెన్సు లేకుండా ఆటో నడిపితే కేసులు నమోదు చేసి అపరాధరుసుం విధిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో మురళీధర్, బ్రేక్‌ఇన్‌స్పెక్టర్లు సుబ్రమణ్యం, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, శ్వేతతో పాటు పలువురు ఉన్నారు.

ప్రతిభ



టీఎస్‌పీఎస్‌సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857
వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.16,400 - 49,870
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.

★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

★ మొత్తం ఖాళీలు: 205.
★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్థీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 90
★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్రీ/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010

ముఖ్యమైన తేదీలు

★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: 9 సెప్టెంబరు
★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: 12 సెప్టెంబరు
★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: 15 సెప్టెంబరు

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 67.
★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

★ మొత్తం ఖాళీలు: - 65
★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.(మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు Jobs

★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 43.
★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 10.
★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.

పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

★ మొత్తం ఖాళీలు: 6
★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిక్స్
★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

★ ఖాళీలు: 2
★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 17,890 - 53,950
★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.
పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.
పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.tspsc.gov.in**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
✪ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఛైర్ - 1.
✪ జువాలజీ - 1.
✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
✪ మ్యాథమెటిక్స్ - 1.
✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.

చివరి తేదీ: 9 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.anu.ac.in**

బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000

చివరి తేదీ: 29 ఆగస్టు

✪ వెబ్‌సైట్: **www.brau.edu.in**

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ చేయనుంది.
✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) -1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.

వెబ్‌సైట్: **www.iimv.ac.in**

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):




37. I. ✔ II. ✔
Both I and II follows.

38. I. ✔ II. ✕
Only I follows.

39. I. ✕ II. ✕
Neither I nor II follows.

40.



I. ✕ II. ✔
Only II follows.

41. 8×20 men = 8×32 women
$\Rightarrow$ 5 men = 8 women
5 men + 8 women = 16 women
$M_1D_1 = M_2D_2$
$\Rightarrow 8 \times 32 = 16 \times D_2$
$\Rightarrow D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square
$= \sqrt{1024} = 32$ cm.
$\therefore$ Length of rectangle
$= 2 \times 32 = 64$ cm.
Breadth of rectangle = 32 – 12 = 20 cm.
$\therefore$ Required ratio = 64 : 20 = 16 : 5

43. x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220
$\Rightarrow$ 5x + 20 = 220 $\Rightarrow$ x = 40
Second lowest number of different set
$= 2 \times 40 - 37 = 43$
$\therefore$ Required sum
= 42 + 43 + 44 + 45 + 46 = 220

44. Bus fare = Rs. 420
Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630
$\therefore$ Required total fare
= Rs. $(2 \times 420 + 4 \times 630)$ = Rs. (840 + 2520)
= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph
Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph
$\therefore$ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph
$\therefore$ Average speed of car and jeep together
$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings
$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen
= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday
= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160
= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006
$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference
$= (14.5 - 6.6) \times 1000$ = Rs. 7900

54. Total monthly rent at Virar over the years
$= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) \times 1000$
= Rs. 21900
$\therefore$ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. I. $5x^2 - 18x + 9 = 0$
$\Rightarrow 5x^2 - 15x - 3x + 9 = 0$
$\Rightarrow 5x(x - 3) - 3(x - 3) = 0$
$\Rightarrow (x - 3)(5x - 3) = 0$
$\therefore x = 3$ or $\frac{3}{5}$
II. $20y^2 - 13y + 2 = 0$
$\Rightarrow 20y^2 - 8y - 5y + 2 = 0$
$\Rightarrow 4y(5y - 2) - 1(5y - 2) = 0$
$\Rightarrow (4y - 1)(5y - 2) = 0$
$\therefore y = \frac{1}{4}$ or $\frac{2}{5}$
Clearly, x > y

57. I. $x^3 = 878 + 453 = 1331$
$\therefore x = \sqrt[3]{1331} = 11$
II. $y^2 = 82 + 39 = 121$
$\therefore y = \sqrt{121} = \pm 11$
$\therefore x \geq y$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$
$\Rightarrow 3 + 4 = x \Rightarrow x = 7$
II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$
$\Rightarrow y^{7/2} = 7^{7/2} \Rightarrow y = 7$
$\therefore$ x = y

59. I. 9x – 4x = 54.55 + 15.45
$\Rightarrow$ 5x = 70 $\Rightarrow$ x = 14
II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$
$\Rightarrow$ y + 155 = 169
$\Rightarrow$ y = 169 – 155 = 14
$\therefore$ x = y

60. I. $x^2 + 11x + 30 = 0$
$\Rightarrow x^2 + 6x + 5x + 30 = 0$
$\Rightarrow x(x + 6) + 5(x + 6) = 0$
$\Rightarrow (x + 5)(x + 6) = 0$
$\therefore x = -5$ or -6
II. $y^2 + 7y + 12 = 0$
$\Rightarrow y^2 + 4y + 3y + 12 = 0$
$\Rightarrow y(y + 4) + 3(y + 4) = 0$
$\Rightarrow (y + 3)(y + 4) = 0$
$\therefore y = -3$ or -4
Clearly, x < y

61. The pattern of the number series is :
$7 \times 2 + 6 = 20$; $20 \times 2 + 6 = 46$
$46 \times 2 + 6 = 98$
$98 \times 2 + 6 = 202$
$202 \times 2 + 6 = 404 + 6 = \boxed{410}$

62. The pattern of the number series is :
$210 - 1^3 = 209$
$209 + 2^2 = 213$
$213 - 3^3 = 186$
$186 + 4^2 = 202$
$202 - 5^3 = 202 - 125 = \boxed{77}$

63. (5) The pattern of the number series is :
27 + 11 = 38
38 + 33 = 71
71 + 55 = 126
126 + 77 = 203
$203 + 99 = \boxed{302}$

64. (3) The pattern of the number series is :
$435 - 9 \times 9 = 354$
$354 - 9 \times 8 = 282$
$282 - 9 \times 7 = 219$
$219 - 9 \times 6 = 165$
$165 - 9 \times 5 = \boxed{120}$

65. (3) The pattern of the number series is :
$4 + 14^2 = 4 + 196 = 200$
$200 + 13^2 = 200 + 169 = 369$
$369 + 12^2 = 369 + 144 = 513$
$513 + 11^2 = 513 + 121 = 634$
$634 + 10^2 = 634 + 100 = \boxed{734}$

Calculations (66 – 70):
$\therefore$ 25% = 75
$\therefore 100\% = \frac{75}{25} \times 100 = 300$
$\therefore$ Total females = 300
Computer Science $\Rightarrow \frac{300 \times 35}{100} = 105$
Civil Engineering $\Rightarrow \frac{300 \times 5}{100} = 15$
Electrical Engineering $\Rightarrow \frac{300 \times 20}{100} = 60$
Mechanical Engineering $\Rightarrow \frac{300 \times 15}{100} = 45$
Bio-technology = 75
Total males = 700 – 300 = 400
Computer Science $\Rightarrow \frac{400 \times 30}{100} = 120$
Civil Engineering $\Rightarrow \frac{400 \times 15}{100} = 60$
Electrical Engineering $\Rightarrow \frac{400 \times 18}{100} = 72$
Mechanical Engineering $\Rightarrow \frac{400 \times 12}{100} = 48$
Bio-technology $= 400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$
$= \frac{100}{3} = 33\frac{1}{3}\%$

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference
= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :
Total students = 105 + 15 + 120 + 60 = 300
Male students = 180
$\therefore$ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average
$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019
$\therefore$ Required answer = 1020

72. ? $= \frac{150 \times 150}{100} + 150$
= 225 + 150 = 375

73. ? $= \frac{300 \times 750}{1000} - 1400$
= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38
$\therefore$ Required answer = 40

75. ? $= \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$
$\therefore$ Required answer = 110

76. C.P. of wrist watch
$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.
= Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200
$\therefore$ Required S.P. of wrist watch =
Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$
= Rs. 4000

77. Fifth number
$= 5 \times 56 - 4 \times 54 = 280 - 216 = 64$

78. Let the number be x.
$\therefore x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$
$\Rightarrow$ x + 245 = 325
$\Rightarrow$ x = 325 – 245 = 80

79. x + 4x + 5x + 60 = 360"
$\Rightarrow 10x = 300° \Rightarrow x = 30$
$\therefore$ Required difference = 5x – x
$= 4x = 4 \times 30 = 120"$

80. On dividing 1740 by 88,
the remainder = 68
$\therefore$ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

Send your feedback to
pratibhadesk@eenadu.net

ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కింది పోస్టులను భర్తీ చేయనుంది.

- ఖాళీలు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూక్లియర్) - 1.
- జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) - 1.
- డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) - 1.
- పర్చేజ్ మేనేజర్ - 3.
- ఈసీఐఎల్ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది. వీటిని బధిరులకు కేటాయించారు.
- సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ - 1
- అకౌంట్స్ ఆఫీసర్ - 2.
- పర్సనల్ ఆఫీసర్ - 2.
- ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

చివరి తేదీ: *31 ఆగస్టు*
వెబ్‌సైట్: **careers.ecil.co.in**

హాయ్! బుజ్జీ!!



మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం

– ఎమర్సన్




పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- push = తోయు
- మకరం = మొసలి

కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!

ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని ఠక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.



- మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.
- అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.
- ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.
- ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చూట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.
- ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.
- ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.
- దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.

కథ



ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

నోటు పాట్లు!

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.

ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

"ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపిరాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది". అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.


నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎండ రివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.

'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

- గుడిపూడి రాధికారాణి



నవ్వుల జల్లులు!



టీచర్: హోంవర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

- జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి



భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..

భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!


- అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?

1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం


చిలిపి ప్రశ్న



రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

- ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక
చిరుత ఉరక

- ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

ఏది భిన్నం?

a



b



c



జవాబులు: **చిలిపి ప్రశ్న:** కలగన్నప్పుడు! **ఏది భిన్నం:** C **జతపరచండి:** 1.సి 2.డి 3.బి 4.ఎ **ఎవరు నేను:** Problem

దళారులపై చర్యలు తప్పవు

కడప సంక్షేమం, న్యూస్‌టుడే : బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరులో దళారులు ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖల జిల్లా కార్య నిర్వహణాధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో బీసీ సంఘాలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. రుణాల మంజూరులో దళారుల పాత్ర తదితర అంశాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . 2015-16, 2016-17 సంవత్సరాల్లో రుణాలు పొందిన వారు తమ యూనిట్లను నిర్వహిస్తున్నారా..? లేదా..? అన్న అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో యూనిట్లు లేకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బీసీ ఫెడరేషన్లకు సంబంధించిన రుణాల విషయంలో ఆయా కుల సంఘాలకు చెందిన నాయకులు దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. దరఖాస్తు చేసుకుంటున్న వారికి వివిధ పథకాల పట్ల అవగాహన లేకపోవటం వల్ల దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని చెప్పారు. బీసీ నాయకులు చిత్తశుద్ధితో కృషి చేస్తే బీసీ ఫెడరేషన్లకు కేటాయించిన 91 యూనిట్లకు రుణాలు ఇవ్వటం సాధ్యం అవుతుందన్నారు. బీసీల జనాభాకు తగిన స్థాయిలో వ్యక్తిగత రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ జిల్లా ఉపాధ్యక్షులు గోవిందనాగరాజు, రజకసంఘం నాయకుడు చేలో రవి, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు పి.రాజా, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గంపా తిరుపతి, శాలివాహనసంఘం నాయకులు చిన్నయ్య , వడ్డెరసంఘం నాయకులు బి.జానకిరామ్ పాల్గొన్నారు.

మామిడి.. కలుపు మొక్కలతో అలజడి

- నివారిస్తేనే అధిక దిగుబడులు సాధ్యం
- కొమ్మ కత్తిరింపులకు సమయం ఇదే
- ఆగస్టులో అనుకూలించిన వర్షాలు
- 70 వేల హెక్టార్లకు చేరిన ఉద్యాన తోటల సాగు



రాయచోటి మండలం చెన్నముక్కపల్లి మామిడి తోటలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

రాయచోటి, న్యూస్‌టుడే: మామిడిలో విరామ సమయం మొదలైంది. మంచి దిగుబడులు సాధించేందుకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన తరుణం ఇదే అన్న విషయాన్ని ఉద్యాన రైతులు గుర్తించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో వర్షాభావంతో ఏటా నీటి ఆధార పంటలు సాగు గణనీయంగా తగ్గిపోతుంది. అరకొర నీరున్న రైతులే కాకుండా వర్షాధారం కింద ఉద్యాన తోటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గత పదేళ్ల కాలంలో జిల్లాలో ఈ తోటల సాగుపై రైతులు మక్కువ పెంచుకుంటున్నారు. తక్కువ నీరున్నా సూక్ష్మ సేద్యం ద్వారా నీటి తడులు అందిస్తూ తోటలను కాపాడుకుంటున్న పరిస్థితి జిల్లాలో నెలకుంది. జూన్, జులై మాసాలలో వర్షాలు కురవాల్సి ఉన్నా ఎగనామం పెట్టాయి. అయినప్పటికీ ఆగస్టు మొదటి వారంలోనే వర్షాభావ పీడిత ప్రాంతంలో వర్షాలు అనుకూలించాయి. ఇదే సమయంలో తోటలలో కలుపు నివారణ, కొమ్మల కత్తిరింపు, ఎరువులు వాడకం, చెదళ్ల నివారణ చర్యలను మరమ్మరం చేయాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

కలుపు మొక్కల బెడద

అన్ని రకాల పంటలలో వచ్చే కలుపు మొక్కలు మామిడిని ఆశిస్తాయి. తోటలలో చెట్ల మధ్య విశాలమైన విస్తీర్ణం ఉండడంతో కొద్దిపాటి వర్షాలు కురిసినా కలుపు విపరీతంగా పెరిగిపోతుంది. మొక్కల మొదళ్లలో నీటి తడులు ఇవ్వడం, నీడ ప్రభావంతో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పచ్చిక తక్కువ సమయంలోనే అల్లుకుంటుంది. ఈ కలుపును తొలగించకపోతే తోటలకు ఇతర అనర్థాలు ప్రభావం చూపుతాయి. పెరిగే కలుపులో తెగుళ్లకు ఆజ్యం పోసే మొక్కలు కలుషితంలా పెరుగుతుంటాయి. వీటిని సకాలంలో తొలగిస్తేనే మామిడి, జామ, దానిమ్మ, జామ చెట్ల ఆకులకు తెగులు సోకే ప్రమాదం తప్పుతుంది. జిల్లాలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, కోడూరు, పులివెందుల డివిజన్లలోనే ఈ సాగు అధికంగా ఉంటోంది. పదేళ్ల కిందట 5 వేల హెక్టార్లు కూడా లేని ఉద్యాన సాగు సుమారు 70 వేల హెక్టార్లకు చేరుకోవడం విశేషం. కరవులో వర్షాధార పంటల నుంచి తక్కువ నీటి ఆధారంగా రైతులకు దిగుబడి ఇచ్చే సాగు వైపు తీసుకెళ్లాలన్న లక్ష్యంతోనే ఉద్యానశాఖ సాగు పెంచగలిగింది. రైతులకు చేదోడుగా ఉండేందుకు గతంలో డివిజన్‌కు అధికారి పర్యవేక్షణ ఉండగా వారి సంఖ్యను పెంచి ఒకటి రెండు మండలాలకే ఒక అధికారిని నియమించడంతో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందుబాటులోకొచ్చాయి. వీటిని సకాలంలో వినియోగించుకుంటే నష్టపోకుండా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని ఉద్యాన పరిశోధకులు అంటున్నారు.



వీరబల్లిలో మామిడిలో సాగైన అంతర పంట

అనుకూలించిన వర్షాలు



వనిత, ఉద్యాన శాఖ అధికారిణి, రాయచోటి

ఆగస్టు మాసం ప్రారంభ దశలోనే వర్షాలు జిల్లాలో కురిశాయి. ఉద్యాన తోటలకు ఈ వర్షాలు ఎంతో అనుకూలమని అధికారులు అంటున్నారు. ఎక్కువ బెట్టతో తోటలు, పంటలు దెబ్బతింటున్న రాయచోటి, లక్కిరెడ్డిపల్లె డివిజన్లపైనే ఈ వర్షం ప్రభావం చూపింది. పొలాల్లో తడి ఆరే లోపే దిగువన పేర్కొన్న చర్యలు తక్షణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

★ మామిడి పంట విరామ సమయంలో కొమ్మల కత్తరింపు కొంత ఆలస్యమైనా ఈ వర్షాలకు మొక్క తూర్పు, పడమర వైపు వృథా కొమ్మలతో పాటు మొక్క ఏపుగా పైకి ఎదిగేందుకు దిగువన ఉన్న కొమ్మలను శాస్త్రీయ పద్ధతిలో కత్తిరించాలి.

★ గుబురుగా పెరిగే చెట్లలో సూర్యరశ్మి, గాలి, వెలుతురు లోపలికి ప్రవేశించేలా తలపై కొమ్మలను కత్తరించాలి.

★ వర్షం కారణంగా మామిడి, జామ, దానిమ్మ, సపోటా వంటి తోటలలో కలుపు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. లోతు దుక్కులు చేసి తర్వాత మిల్లర్ వేయడం ద్వారా కలుపు గడ్డి మొక్కలు ఎండి భూమిలో ఎరువుగా తయారవుతాయి.

★ దున్నకం పూర్తి చేసిన తర్వాత చెట్ల మొదళ్లల్లో దగ్గర పాదులు తవ్వించిన తర్వాత నీటి తడులు ఇవ్వడం, డ్రిప్‌పైపులు అమర్చి నీటి చుక్కలు ద్వారా తడిని ఇవ్వాల్సి ఉంటుంది.

★ కొమ్మ కత్తిరింపుల వల్ల చెట్లపైన సూక్ష్మపోషకుల ధాతువుల లోపం లేకుండా నివారించుకోవచ్చు.

★ సూక్ష్మపోషక ధాతువులు అన్ని కలిసి ఉన్న ఫార్ములా 7 లేదా ఫార్మరులా 9 కాని 4 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

★ వర్షంతో కొత్త మామిడి చిగుర్లు వస్తాయి. ఇదే సమయంలో రసం పీల్చే పురుగు ఆశిస్తుంది. వీటి నివారణకు ఇమిడాక్లోఫిడ్ లేదా ఫిప్రోనిల్ వంటి క్రిమిసంహారక మందులు తోటలపై పిచికారి చేయాలి.

★ పాదులు తీసిన చెట్టుకు 500 గ్రాముల యూరియా, 750 గ్రాముల మ్యూరిట్ ఆఫ్ పొటాష్, 80 కిలోల పశువుల ఎరువు, సూపర్ పాస్ఫేట్ 5 కిలోలు చొప్పున 8 ఏళ్లు పైబడిన చెట్లకు వేయాలని ఉద్యాన అధికారిణి వనిత 'న్యూస్‌టుడే'కి వివరించారు.

ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయాలి

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య

బిల్టప్ (కడప), న్యూస్‌టుడే: దళితులు చదువుకోరని, శుభ్రంగా ఉండరని దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అవుతున్నా మారరని వివక్ష పూరితంగా వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని అంబేడ్కర్ కూడలిలో మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అవుతున్నా.. దళితులు ఇంకా వివక్షకు, దాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన మంత్రి దళితులను కించపరిచేలా వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు సునీల్, డీహెచ్‌పీఎస్ నాయకులు వెంకట శివ, ఎస్సీ, ఎస్టీ మానవ హక్కుల వేదిక నాయకులు రమణ, వైకాపా ఎస్సీ విభాగం నాయకులు సురేష్, వేణుగోపాల్ తదితర దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

★ దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని దళిత, గిరిజనుల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం దళిత, గిరిజనులపై చిత్తశుద్ధి ఉన్నా మంత్రిని తొలగించాలని అన్నారు. దళితులు చదువుకోరని, శుభ్రంగా ఉండరని, అందుకే 10 ఏళ్లకే రిజర్వేషన్ ప్రక్రియను ఆపాల్సి ఉన్నా ఇంకా కొనసాగిస్తున్నామని చెప్పడం దళితులను అణచి వేసేలా కానవస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళితులు సత్తా చూపుతారని హెచ్చరించారు. సమావేశంలో రాజు, నాగరాజు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కూడలిలో ఆందోళన చేస్తున్న నాయకులు

దళితులపై వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

దళితులపై మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని భాకమా రాష్ట్ర నాయకులు నారాయణ, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాల్సిన మంత్రి దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు.

కొండాపురం : ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఆత్మగౌరవాన్ని కాలరాస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు మంత్రి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యదినోత్సవం నాడు మంత్రి చేసిన వ్యాఖ్యలు మొత్తం దేశంలోని దళితులను అవమానించేవిధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి, గంగులు, శ్రీనివాసులు, మండల నాయకులు నాగసుబ్బరాయుడు, గోపాల్, తులశమ్మతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దళితులను కించపరిచిన మంత్రి క్షమాపణ చెప్పాలి

చింతకొమ్మదిన్నె : దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డి క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వలయ రహదారిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జి.గంగయ్య, కార్యదర్శి పాలకొండయ్య, జిల్లా అధ్యక్షుడు మాతంగి సుబ్బరాయుడు, రాయలసీమ సమన్వయకర్తలు రామకృష్ణ, మునెయ్య, రెడ్డెయ్య పాల్గొన్నారు.

'ఆది'ని రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు ఆరోపణలు

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు నెల్సన్‌కుమార్

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులను కించపరిచేలా మాట్లాడారని ఓ పత్రిక, ఛానల్ (ఈనాడు, ఈటీవీ కాదు) తప్పుడు ప్రచారం చేయడం ఎంత మాత్రం తగదని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బిర్రు నెల్సన్‌కుమార్, 7వ వార్డు కౌన్సిలర్ దానం, పెద్దండ్లూరు ఎంపీటీసీ సభ్యులు మంత్రాల పెద్దయ్యవారు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జయపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మంత్రి కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి ఆదినారాణరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని చూడడం దారుణమన్నారు. తన రాజకీయ జీవితంలో ఆదినారాయణరెడ్డి దళితుల సంక్షేమానికే పాటుపడ్డారు తప్ప ఏనాడూ వ్యతిరేకంగా పనిచేయలేదన్నారు. దళితులు ఇంకా వెనుకబడి ఉన్నారనే ఆవేదన తప్ప ఆయన మదిలో ఏ ఉద్దేశ్యమూ లేదన్నారు. ప్రభుత్వ ఫలాలు ఆయా వర్గాలకు మరింతగా అందాలని, అభివృద్ధి చెందాలని ఆయన చెప్పారని తెలిపారు. దీనిని రాజకీయంగా వక్రీకరించి ఇబ్బంది పెట్టాలని చూడటం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో పెద్దముడియం మండల మాజీ ఉప మండలాధ్యక్షుడు కె.కొండారెడ్డి, ఎరుకల సంఘ స్థానిక నాయకులు సుబ్బన్న, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు నెల్సన్ కుమార్



డాక్టర్ రామేశ్వరుడు

ఆసుపత్రి అభివృద్ధి చెందాలనేదే ఆయన తపన : ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి చెందాలనే తపన మంత్రి ఆదినారాయణరెడ్డికి ఎంతగానో ఉందని జమ్మలమడుగు వైద్యాధికారి డాక్టర్ రామేశ్వరుడు పేర్కొన్నారు. బుధవారం తన ఛాంబరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి విషయమై మంత్రి సమావేశం నిర్వహించారని, చదువు, శుభ్రత సమాజంలో అందరికీ అవసరం ఆ కోణంలోనే ఆయన మాట్లాడారు తప్ప ఎవరినీ కించపరచలేదని పేర్కొన్నారు. మంత్రి ఆదినారాయణరెడ్డి ఎవరినీ కించపరిచేవిధంగా మాట్లాడలేదని ప్రభుత్వ ఆసుపత్రి హెడ్‌నర్సు లీలారాణి, నర్సు దానమ్మలు విలేకర్లకు తెలిపారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం

కడప సంక్షేమం, న్యూస్‌టుడే : జిల్లాలోని నాలుగు నూతన గిరిజన సంక్షేమ పాఠశాలల్లో తెలుగు, హిందీ సబ్జెక్టులు బోధించడానికి పొరుగు సేవల కింద ఉపాధ్యాయులను నియమించనున్నామని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి లలితాబాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను కూడా ఈ పద్ధతిలో భర్తీ చేయనున్నామని తెలిపారు. తెలుగు, హిందీ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీలో ప్రథమ లేదా ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆ భాషల్లో పండిట్ కోర్సులను చదివి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు ఇంటరతో బాటూ యుజీ డీపీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. భాషోపాధ్యాయులకు నెలకు రూ. 7500, వ్యాయామ ఉపాధ్యాయులకు నెలకు రూ. 6500 వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ లోగా వారికి సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులు ఇచ్చిన అభ్యర్థులు ఈ నెల 21న రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ డిగ్రీ కళాశాల వద్ద గల గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమోకు హాజరు కావాలని తెలిపారు.

వంతెన.. ఇంతేనా..?

నిర్మించి తొమ్మిదేళ్లే.. భయపడేలా పరిస్థితి







జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. జమ్మలమడుగు సమీపంలో పెన్నానదిపై ఉన్న వంతెనే అందుకు కారణం. ఈ వంతెనపై అనేక చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల ఇనుప కడ్డీలు బయటకు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి.. రెండు నెలల క్రితం ఈ వారధిపై రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. జమ్మలమడుగు - ముద్దనూరు ప్రధాన రహదారిలో పెన్నా నదిపై ఈ వంతెనను నిర్మించారు. 2008 డిసెంబరు 24న దీన్ని ప్రారంభించారు. నిర్మించి తొమ్మిదేళ్లే అయినా ఇది గతుకులమయంగా మారింది. చాలాచోట్ల గుంతలు పడ్డాయి. ఇనుపకడ్డీలు బయటకు వచ్చి భయపెడుతున్నాయి. రాత్రివేళల్లో ఈ వంతెనపై ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు.

- జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే.

(ఫొటోలు: శ్రీనివాస్ పట్నాయక్)

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం



సమీక్ష చేస్తున్న కలెక్టర్ బాబూరావు, చిత్రంలో ఎస్పీ బాబూజీ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ బాబూరావు నాయుడు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ.. జిల్లాలో 45 ప్రమాద ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించామని పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. వాహన చోదకులకు కన్పించే విధంగా పెద్ద పెద్ద బోర్డులు ప్రమాద ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారి వెంబడి గ్రామాలకు వెళ్లే దారుల్లోనూ హెచ్చరిక బోర్డులు, రాజంపేట- చిట్వేలి కూడలి, ఒంటిమిట్ట, మంగంపేట, ఆలంఖాన్‌పల్లె తదితర ప్రాంతాల్లో తక్షణమే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కడప నగరంలోని అప్సర కూడలి, ఐటీఐ, బిల్టప్, పాత రిమ్స్ తదితర ప్రాంతాల్లో నెల రోజుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాయచోటి ఘాట్ రోడ్డులో ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలవి అందించేలా చేసిన పోలీస్ పెట్రోలింగ్ వాహనంలోని ఏఎస్సై, రఘురాం, కానిస్టేబుల్ రాజగోపాల్, యోబులకు కలెక్టర్, ఎస్పీ క్యాష్ అవార్డు అందించారు. కార్యక్రమంలో డీటీసీ బసిరెడ్డి, సీపీవో తిప్పేస్వామి, ఎస్ఈలు నాగేశ్వర్రావు, సంజీవరావు, శివప్రసాద్‌రెడ్డి, ఈఈ ఓబుల్‌రెడ్డి, చంద్రశేఖర్, కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధంగా వినాయక విగ్రహాలు : ఈ నెలలో జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతిమలన్నీ ప్రకృతి సిద్ధమైన వస్తువులతో తయారు చేసుకుని పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవాల్లో రాత్రి పది గంటల వరకు మాత్రమే స్పీకర్లు ఉంచాలని, ఎక్కువ శబ్ధాలు వచ్చే బాణా సంచా కాల్చకూడదని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కన్నతల్లి కన్నీటి విన్నపం.. కరిగిపోయిన ఎస్పీ

మరో 'గల్ఫ్ వ్యథ'

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: నా బిడ్డను ఎలాగైనా ఇంటికి రప్పించమంటూ బుధవారం ఓ మహిళ జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ కాళ్లమీదపడి వేడుకుంది. కత్తర్ దేశంలో చిక్కుకుపోయిన చిన్నకొడుకును చూడాలని తన ప్రాణం విలవిలలాడుతోందంటూ కన్నీటిపర్యంతమైంది. దీంతో ఎస్పీ చలించిపోయారు. వెంటనే చర్యలు చేపట్టాల్సిందిగా సీఐ సాయినాథ్‌ను ఆదేశించారు. నీబిడ్డను తప్పకుండా నీ ఇల్లు చేరుస్తామంటూ ఆమెను ఓదార్చారు. ఇంతకీ అంతమంది పోలీసుల ముందు 'అమ్మ' ఎందుకు కన్నీరు కార్చిందంటే.. పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన బూతల నారాయణరెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు జయవర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి అనే కుమారులున్నారు. చిన్నకొడుకు 15 నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం కత్తర్‌కు వెళ్లాడు. అక్కడ ఓ సేఠ్ వద్ద కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. మొదట ఆరునెలలు బాగానే చూసుకున్న సేఠ్ కుటుంబం ఆతరువాత జీతంకూడా సరిగా ఇవ్వకుండా వేధిస్తున్నారు. జీతం గట్టిగా అడగడంతో సేఠ్ కుమారుడు తుపాకీ తలకు గురిపెట్టి బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో పవన్‌కుమార్‌రెడ్డి వణికిపోయాడు. సమయం చూసుకుని ఆ ఇంటినుంచి ప్రాణభయంతో పారిపోయాడు. పవన్ డ్రైవరుగా పనిచేస్తున్న కారుకు అక్కడి పోలీసులు ఇదివరకే రూ. 2.5 లక్షల జరిమానా విధించి ఉన్నారు. అతను స్వదేశానికి రావాలంటే ఆ పన్ను చెల్లించాలని అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. భారత ఎంబసీ కార్యాలయానికి వెళ్లినా తమకు సంబంధం లేదని చెబుతున్నట్లు పవన్‌కుమార్‌రెడ్డి అక్కడి నుంచి చరవాణి సామాజిక మాధ్యమాల ద్వారా తన ఆక్రందనను తెలియజేస్తున్నాడు. దీంతో అతని తల్లి కుమిలిపోతోంది. ఈనెల 10న కడపకు వెళ్లి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ కోడూరుకు వచ్చారని తెలియడంతో ఆమె తన ఆవేదనను మరోసారి ఆయనకు వ్యక్తపరిచారు. రాజంపేటనుంచి ఏజెంటును పిలిపించి ఈవిషయంపై చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.





ఎస్పీ కాళ్లపైపడి వేడుకుంటున్న లక్ష్మీదేవి